E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం



గ్రూప్-1 తుది జాబితా విడుదల

» 2లో

(తేదీ) 25-09-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

సెమీకండక్టర్ రంగంలో 22%తగ్గిన నియామకాలు

» 4లో



బంగ్లాకు అభి'షాక్'

» 6లో



బాక్సాఫీస్ దగ్గర.. పవన్ తుపాన్

» 5లో



## బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు చేయండి



- 26న బతుకమ్మకుంట సంబురాల్లో పాల్గొననున్న సీఎం.. 29న సరూర్‌నగర్ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో ఉత్సవం
- గిన్నిస్‌బుక్ రికార్డుల్లోకి ఎక్కే అవకాశం: సీఎస్

ఈకబురు,హైదరాబాద్ : ఈ నెల 29న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే భారీ బతుకమ్మ కార్యక్రమం తోపాటు 26న ముఖ్యమంత్రి పాల్గొనే బతుకమ్మకుంట బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బతుకమ్మ ఉత్స వాల ఏర్పాట్లపై బుధవారం ఆయన సచివాలయం నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

తరువాయి 2లో

## 71 మంది మావోయిస్టుల లొంగుబాటు



- వారిలో 21 మంది మహిళలు, ముగ్గురు మైనర్లు
- 30 మందిపై రూ.64 లక్షల రివార్డు
- పోలీసులపై దాడులు, విధ్వంసక చర్యల్లో వారి ప్రమేయం

తరువాయి 2లో

## రైల్వే ఉద్యోగులకు బోనస్

- ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951
- 10.91 లక్షల మందికి ప్ర యోజనం



తరువాయి 2లో

## గ్రూప్1 నియామకాలకు పచ్చజెండా




- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు నిలిపివేత
- తుది తీర్పునకు లోబడి నియామకాలు
- పేపర్ లీకేజీ, విధానపరమైన లోపాలు ఉంటేనే కోర్టులు జోక్యం చేసుకోవాలి

తరువాయి 2లో

## బీసీ రిజర్వేషన్ల అమలుకు చిత్తశుద్ధితో కృషి: సీఎం

» 2లో



## దేశ ద్రోహి కాంగ్రెస్.. ప్రజా ద్రోహి బీజేపీ

- యూరియా అడిగితే రైతులపై థర్డ్ డిగ్రీనా?
- ఇదేనా రాహుల్ చెప్పిన మొహబ్బత్ కీ దుకాణ్
- జీఎస్టీ పేరిట మోదీ రూ.15 లక్షల కోట్లు దోచుకు న్నందుకు పండుగ చేసుకోవాలా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఈకబురుహైదరాబాద్ : "దేశ ద్రోహి కాంగ్రెస్.. ప్రజా ద్రోహి బీజేపీ. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ సర్కార్ సామాన్యుడి నడ్డి విరుస్తోంది. యూరియా కోసం రోడ్డెక్కిన రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం రేవంత్ రెడ్డి సిగ్గుమాలిన పని తనానికి నిదర్శనం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం కరీంనగర్‌కు చెందిన డాక్టర్ దంపతులు ఒంటెల రోహిత్ రెడ్డి, గోగుల గౌతమి రెడ్డిలు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. జీఎస్టీ పేరుతో ఎనిమిదేళ్లుగా ప్రజల నుంచి రూ.15 లక్షల కోట్లు దోచుకున్న ప్రధాని మోదీ.. ఇప్పుడు బిహార్ ఎన్నికల కోసం జీఎస్టీ శ్లాబులు తగ్గించి పండుగ చేసుకోవాలనడం

తరువాయి 2లో

## మోదీ సర్కార్‌కు చట్టబద్ధత లేదు

- ఎక్కడ చూసినా 'ఓట్ చోర్.. గద్దీ చోడ్'
- కాంగ్రెస్ పోరాటంలో అంతా కలిసిరావాలి
- బెడిసికొట్టిన మోదీ 'కౌగిలింతల దౌత్యం'
- మిత్రదేశమంటూనే సుంకాలు వేసిన ట్రంప్
- అమెరికా జబ్బు కంటే చైనా మందు ప్రమాదం
- బిహార్‌లో సీడబ్ల్యూసీ భేటీలో తీర్మానం
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో అత్యంత వెనుకబడ్డ బీసీలకు చట్టం: రాహుల్



తరువాయి 2లో

## నేడో, రేపో రిజర్వేషన్ల జీవో?


- వెంటనే స్థానిక ఎన్నికల షెడ్యూల్ వెలువరించనున్న ఎస్ఈసీ
- ఆ మరుసటి రోజే నోటిఫికేషన్
- ఖరారైన రిజర్వేషన్లపై జీవో జారీకి కసరత్తు
- ఎన్నికలకు నవంబర్ వరకు గడువు కోరనున్న స




ఈకబురు, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధించిన ప్రత్యేక జీవో..గురు లేదా శుక్రవారం విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే ముందుగా విద్యా, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీ సంక్షేమశాఖ లేదా ప్రణాళిక శాఖ జీవో జారీ చేస్తుంద ని సమాచారం. ఈ జీవో వచ్చాకే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించి జీవో ఇవ్వాల్సి ఉంటుందని తెలుస్తోంది.

తరువాయి 3లో

## సందర్శకుల శునకాలపై సుంకం



తరువాయి 3లో

మొదటి పేజీ తరువాయి

# గ్రూప్1 నియామకాలకు పచ్చజెండా

ఈకబురు, హైదరాబాద్ :గ్రూప్1 నియామకాలకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. గ్రూప్1 మెయిన్స్ పరీక్షల ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును నిలిపివేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి నియామకాలు చేపట్టుకోవచ్చని.. నియామకపత్రాలు ఇవ్వవచ్చని తెలిపింది. అయితే ఆ నియామకాలన్నీ తాము ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని పేర్కొంది. "తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఇది మొదటి గ్రూప్1 నోటిఫికేషనా? ఇప్పటి వరకూ ఎందుకీ పరీక్ష నిర్వహించలేదు.. 2014 నుంచి రాష్ట్రంలో కమిషన్ లేదా?" అని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కాగా.. ద్విసభ్య ధర్మాసనం జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులతో టీజీపీఎస్సీకి భారీ ఊరట లభించినట్లయింది. గ్రూప్1 ప్రధాన పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనంలో లోపాలు, డబుల్ హాల్‌టికెట్లు, పరీక్షా కేంద్రాల కేటాయింపు, కొన్ని సెంటర్లలో ఎక్కువమంది ఎంపిక కావడం, ఎంపిక చేసిన అభ్యర్థులను కొన్ని సెంటర్లకు కేటాయించడం, తెలుగు మాధ్యమ అభ్యర్థులపై వివక్ష, ఎవాల్యుయేటర్ల ఎంపికలో లోపాలు వంటి కారణాలను చూపుతూ.. ఆ పరీక్ష ఫలితాలను రద్దు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకుల జాబితాను కొట్టేస్తూ ఈ నెల 9న 222 పేజీల తీర్పు వెలువరించింది. అయితే.. ఆ తీర్పు తప్పులతడకగా ఉందని, అది చెల్లదని పేర్కొంటూ టీజీపీఎస్సీతో పాటు ఎంపికైన అభ్యర్థులు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో మొత్తం 15 రిట్ అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. టీజీపీఎస్సీ తరపున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి, కమిషన్ స్టాండిం గ్ కౌన్సిల్ పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపించారు. 'గ్రూప్1 మెయిన్స్ పరీక్షల్లో భారీగా తప్పులు జరిగాయనడానికి ఎలాంటి ఆధారాలూ లేవు. చిన్న చిన్న కారణాలను సాకుగా చూపుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. వాటన్నింటికీ శాస్త్రీయంగా పూర్తి వివరాలతో టీజీపీఎస్సీ సమాధానం చెప్పింది. సింగిల్ జడ్జి ఆ విషయాలను పట్టించుకోకుండా ఫలితాలను రద్దు చేశారు. పునర్ మూల్యాంకనం అనేది కమిషన్ రూల్స్‌లో లేనే లేదు. సుప్రీంకోర్టు ఇచ్చిన 'సంజయ్‌సింగ్ వర్సెస్ యూపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్' తీర్పు ప్రకారం మోడరేషన్ పద్ధతి అమలు చేయలేదని సింగిల్ జడ్జి రూలింగ్ ఇవ్వడం సరి కాదు. ఒక్కో సమాధాన పత్రాన్నీ ఇద్దరు ఎవాల్యుయేటర్లు దిద్దుతారు. వారు ఇచ్చిన మార్కుల మధ్య 15 శాతం కంటే ఎక్కువ వ్యత్యాసం ఉంటే సదరు సమాధాన పత్రం మూడో ఎవాల్యుయేటర్ వద్దకు వెళ్తుంది. మొత్తం సెంటర్లు 45 అని ముందు ప్రకటించి 46కు పెంచడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఒక సెంటర్ ఏర్పాటు చేయాల్సి రావడం వల్ల అలా జరిగింది. అలాగే కోఠిఉమెన్స్ కాలేజీలో 18, 19 సెంటర్లలో కేవలం మహిళలే ఉండటానికి కారణం.. అక్కడ పురుషులకు టాయిలెట్ సౌకర్యాలు లేవు. కేవలం మహిళలను మాత్రమే కేటాయించాలని సదరు కాలేజీ చేసిన విజ్ఞప్తి మేరకు అక్కడ మహిళలను మాత్రమే కేటాయించారు. ఇవన్నీ కమిషన్ అధికార పరిధిలోని అంశాలు. వీటి వల్ల పిటిషనర్లకు కలిగిన నష్టం ఏంటో నిరూపించలేదు' అని పేర్కొన్నారు.

**ఆధారాలెక్కడ?**

విచారణ సందర్భంగా ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ, భారీ లోపాలపై ప్రశ్నించింది. "డబుల్ హాల్‌టికెట్లు, సెంటర్ల పెంపు, ప్రత్యేకంగా మహిళల కేటాయింపు వంటివి కమిషన్ పరిధిలోని అంశాలు.. వాటి ఆధారంగా ఫలితాలను ఎలా కొట్టేయగలం? ఫలితాలను కొట్టేయడానికి ఈ చిన్న విషయాలు కారణాలా? సింగిల్ జడ్జి తీర్పులో పేర్కొన్న విధంగా సమగ్రత లేదనడానికి, వివక్ష, విధానపరమైన లోపాలు వంటి అంశాలకు ఆధారాలు ఎక్కడ ఉన్నాయి?" అని ప్రశ్నించింది. అలాంటివేవీ లేకుండానే ఫలితాలను కొట్టేశారని ఏజీ సమాధానం ఇచ్చారు. ఒకే సబ్జెక్టును తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో రాసే అభ్యర్థుల పేపర్లను ఎలా దిద్దుతారని ధర్మాసనం ప్రశ్నించగా.. ఏ మాధ్యమంలో రాసినా అభ్యర్థుల ప్రతిభను బట్టి కచ్చితమైన మార్కులు ఇవ్వడానికి ఎవాల్యుయేటర్లు, చీఫ్ ఎగ్జామినర్లు సరైన మార్గదర్శకత్వం, శిక్షణ ఇచ్చారని.. ఏజీ బదులిచ్చారు. టీజీపీఎస్సీ తరఫున మరో సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదిస్తూ.. అన్ని చిన్న చిన్న విషయాలే తప్ప మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ వంటి భారీ ఆరోపణలు లేనేలేవని పేర్కొన్నారు. ఏపీలో తెలుగు మాధ్యమ అభ్యర్థులు తెలంగాణ కంటే ఇంకా తక్కువ శాతం ఎంపికయ్యారని గుర్తుచేశారు.

**తప్పుగా అర్థం చేసుకున్నారు..**

ఎంపికైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాదులు ఎస్ మురళీధర్, దేశాయి ప్రకాశ్‌రెడ్డి, న్యాయవాదులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు వాదించారు. టీజీపీఎస్సీ పరీక్షల నిర్వహణలో పాటించిన విధానమే తప్పు అనుకున్నప్పుడు.. రీఎవాల్యుయేషన్ చేయడం వల్ల ఆ తప్పులన్నీ ఒప్పు అవుతాయా? అని వారు ప్రశ్నించారు. పేర్కొన్నారు. సింగిల్ జడ్జి కమిషన్ అధికార పరిధిలోకి చొచ్చుకుపోయారని.. ఆయన తీర్పును అమలు చేస్తే భవిష్యత్తులో పరీక్షలపై విపరీతమైన కేసులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలిపారు. రెండు హాల్‌టికెట్లు ఇవ్వడం అనేది కమిషన్ విచక్షణపై ఆధారపడి ఉంటుందని తెలిపారు.

**పేపర్లు దిద్దకుండానే..**

సింగిల్ జడ్జి వద్ద కేసు గెలిచిన రిట్ పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు జి.విద్యాసాగర్, రచనారెడ్డి, సురేందర్‌రావు వాదనలు కొనసాగించారు. రూల్స్‌లో లేనివిధంగా మూడో ఎవాల్యుయేటర్ ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. మూడో ఎవాల్యుయేటర్ ఉన్నట్లు కమిషన్ ఎక్కడా చెప్పలేదని.. ఇదంతా ఫ్రాడ్ చేయడానికి డిజైన్ చేశారని ఆరోపించారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. "మొత్తం ప్రొసీజర్ తప్పు అన్నప్పుడు పునర్ మూల్యాంకనం వల్ల లాభం ఏంటి?" అని ప్రశ్నించింది. దీనికి సీనియర్ న్యాయవాది సురేందర్‌రావు సమాధానం ఇస్తూ.. అసలు మూల్యాంకనమే జరగలేదని.. ఒక్కో సమాధానానికి కాకుండా ఒక్కో అభ్యర్థికి మార్కులు కేటాయించారని పేర్కొన్నారు. అభ్యర్థులు రాసిన సమాధానాలు తప్పా లేదా ఒప్పా చెప్పకుండా అభ్యర్థులవారీగా మార్కులు కేటాయించారని తెలిపారు. పేపర్లు దిద్దకుండా మార్కులు కేటాయించారని ఆరోపించారు. కాబట్టి మళ్లీ పేపర్లు దిద్దితే అది పునర్ మూల్యాంకనం కాదని.. అది తాజా మూల్యాంకనమే అవుతుందని పేర్కొన్నారు. అయితే.. అసలు మూల్యాంకనమే జరగలేదన్న వాదనను అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. భౌతికంగా సమాధాన పత్రాల్లోని ఒక్కో పేజీపై రెడ్ పెన్‌తో గీత గీసి మార్కులు అక్కడ రాస్తారా? ఇదేమి వాదన అని ఆగ్రహం వ్యక్తంచేశారు. మళ్లీ రెండో ఎవాల్యూయేటర్ పేపర్ దిద్దేటప్పుడు ఎలా? ఆయన కూడా మళ్లీ గీతలు గీయాలా? అడ్డంగా నిలువుగా గీతలు గీసి మార్కులు రాస్తారా? చిన్న పిల్లల పేపర్లు దిద్దినట్లు గీతలు గేస్తేనే సమాధాన పత్రాల మూల్యాంకనం చేసినట్లు భావించాలనే వాదన ఏంటని అని ఏజీ ప్రశ్నించారు. సీనియర్ న్యాయవాది రచనారెడ్డి తన వాదనను కొనసాగిస్తూ.. కమిషన్ తన నోటిఫికేషన్‌లోని రూల్స్‌ను తానే ఉల్లంఘించిందని పేర్కొన్నారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. సమగ్రత లేకపోవడం అనేది తీవ్రమైన, గంభీరమైన ఆరోపణ అని దానికి ఎక్కడ ఆధారాలు ఉన్నాయో చూపాలని రచనారెడ్డిని ప్రశ్నించింది. నిపుణులు మాత్రమే చేయాల్సిన పనుల్లోకి కోర్టులు ఎలా దూరగలవని ప్రశ్నించింది. అందరి వాదనలు విన్న అనంతరం.. కీలకమైన విషయాలతో లఘు నోట్ ఇవ్వాలని ఇరు పక్షాలనూ ఆదేశించింది. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చుకోవచ్చని.. అయితే ఆ నియామకాలు తమ తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టంచేస్తూ.. తదుపరి విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది.



మొదటి పేజీ తరువాయి

# గ్రూప్1 తుది జాబితా విడుదల



**ఈ-కబురు, హైదరాబాద్ : గ్రూప్-1 పరీక్షల ఫలితాలకు సంబంధించి టీజీపీఎస్సీ తుది జాబితాను విడుదల చేసింది. రాష్ట్ర హైకోర్టు బుధవారం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో అర్ధరాత్రి తుది జాబితాను సిద్ధం చేసింది. మొత్తం 563 పోస్టుల కోసం ఇప్పటికే 600 మందిని ఎంపికచేసిన కమిషన్.. వారి ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ ప్రక్రియను పూర్తిచేసింది. తుది జాబితా ప్రకటించబోయే సమయంలో కోర్టు స్టే ఇవ్వడంతో ప్రక్రియ నిలిచిపోయింది. నియామక ప్రక్రియ ప్రారంభించవచ్చని బుధవారం కోర్టు తీర్పు ఇవ్వడంతో.. వెంటనే ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటికే ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసుకున్న వారిలో 563 మందికి వారి ర్యాంకుల ఆధారంగా తుది జాబితా సిద్ధం చేసి అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టారు. 562 మందిని ఎంపిక చేసి.. ఒక పోస్టును పెండింగ్‌లో ఉంచారు. తుది జాబితాలో 45 డిప్యూటీ కలెక్టర్, 115 డీఎస్పీ పోస్టులతోపాటు వివిధ శాఖల్లోని మొత్తం 563 పోస్టులకు సంబంధించిన ఎంపిక ప్రక్రియ బుధవారం అర్ధరాత్రి పూర్తయింది. దీనికి సంబంధించి అభ్యర్థులకు టీజీపీఎస్సీ సమాచారం అందించింది. ర్యాంకులవారీగా పోస్టులు కేటాయించారు. తుది జాబితా విడుదల కావడంతో.. ఎంపికైనవారు తమకు కేటాయించిన శాఖల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.**

మొదటి పేజీ తరువాయి

# బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు చేయండి

ఈకబురు,హైదరాబాద్ :ఈ నెల 29న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే భారీ బతుకమ్మ కార్యక్రమంతోపాటు 26న ముఖ్యమంత్రి పాల్గొనే బతుకమ్మకుంట బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆయన సచివాలయం నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అంబర్‌పేట్‌లో ప్రభు త్వం పునరుద్ధరించిన బతుకమ్మకుంటలో 26న నిర్వహించే బతుకమ్మ సంబురాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారని సీఎస్ తెలిపారు. దీనికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. బతుకమ్మకుంట ప్రారంభోత్సవ కార్యక్రమ ఆహ్వానాలను ప్రజాప్రతినిధులు, వీఐపీలకు సకాలంలో పంపాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే బతుకమ్మ కార్యక్రమానికి 10వేలకుపైగా మహిళలు హాజరవుతారని, ఇది గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కే అవకాశం ఉందన్నారు. 27న ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ కార్నివాల్, 29న పీపుల్స్ ప్లాజా, 30న ట్యాంక్‌బండ్‌పై పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశామని పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పేర్కొన్నారు.

**కార్నివాల్‌కు హెచ్‌ఎండీఏ ఏర్పాట్లు**

ఈ నెల 27న ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ కార్నివాల్ నిర్వహించేందుకు హెచ్‌ఎండీఏ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ట్యాంక్‌బండ్‌పై ఆ రోజున సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పూర్తిగా రాకపోకలు నిలిపివేయనున్నారు. అలాగే ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నాయి. బతుకమ్మ కార్నివాల్‌లో నగరంలోని అన్ని ప్రాంతాల మహిళలు పెద్దఎత్తున పాల్గొనేందుకు, బతుకమ్మ ఆడేందుకు వీలుగా చర్య లు చేపడుతున్నారు. సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతి కలిగించే కార్యక్రమాలు ఉండనున్నాయి. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు.

# మోదీ సర్కార్‌కు చట్టబద్ధత లేదు



ఈకబురు,హైదరాబాద్ : ఎన్నికల్లో బీజేపీయే గెలిచేలా వ్యవస్థీకృతంగా జరుగుతున్న ఓట్ల చోరీ కుట్ర బయటపడిందని.. అలా ఏర్పడిన ఈ ప్రభుత్వానికి ఎలాంటి నైతిక, రాజకీయ చట్టబద్ధత లేదని కాంగ్రెస్ పేర్కొంది. ఓట్ల చోరీ వ్యవహారంతో ప్రజాస్వామ్యంపై ప్రజల్లో ఉన్న నమ్మకం సడలిపోతోందని వ్యాఖ్యానించింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) మన ప్రజాస్వామ్యానికి ముప్పు అని.. ఓటర్ల జాబితాల్లో అక్రమాల కోసం బీజేపీ చేస్తున్న మోసమని అభివర్ణించింది. దేశ ప్రజలు దీనంతటినీ గమనించాలని.. ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చింది. 'ఓట్ చోర్.. గద్దీ చోడ్ (ఓట్ల దొంగ.. గద్దె దిగు)' నినాదం ఇప్పుడు బిహార్‌లో ఇంటింటా వినిపిస్తోందని, రేపు దేశవ్యాప్తంగా మారుమోగుతుందని పేర్కొంది. ఈ మేరకు బిహార్‌లోని పాట్నాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో రెండు తీర్మానాలు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో అగ్రనేత రాహుల్ గాంధీ, సీనియర్లు అజయ్ మాకెన్, కేసీ వేణుగోపాల్, జైరామ్ రమేశ్, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి దామోదర, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో కీలక నిర్ణయాలు తీసుకునే సీడబ్ల్యూసీ సమావేశాలను దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బిహార్‌లో నిర్వహించడం ఇదే మొదటిసారి.

**రాహుల్‌కు సెల్యూట్ చేస్తున్నాం..**

ఓటు చోరీ వ్యవహారంతో దేశ ప్రజల్లో ప్రజాస్వామ్యంపై నమ్మకం సడలిపోతోందని సీడబ్ల్యూసీ తీర్మానంలో పేర్కొంది. ''బీజేపీ గెలిచేలా వ్యవస్థీకృతంగా, క్రమపద్ధతిలో జరుగుతున్న కుట్ర బయటపడింది. ఇలా ఓట్ల చోరీతో ఏర్పడిన ఈ ప్రభుత్వానికి ఎలాంటి నైతిక, రాజకీయ చట్టబద్ధత లేదు. నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, ధరల పెరుగుదల, విద్య, వైద్య వ్యవస్థల విధ్వంసం వంటివేవీ బీజేపీకి పట్టవు. ఎందుకంటే తాము ప్రజలకు సేవ చేసి ఓట్లు పొందాల్సిన అవసరం లేదని, ఓట్ల చోరీతో గెలిచేయవచ్చని వారికి తెలుసు. అలాంటి ఓటు చోరీపై ధైర్యంగా పోరాడుతూ, అవకతవకలను బయటపెడుతున్న రాహుల్ గాంధీకి సెల్యూట్ చేస్తున్నాం'' అని తెలిపింది. ఇప్పుడు ఓటు చోరీ చేస్తున్నవారు భవిష్యత్తులో ప్రజల గౌరవాన్ని, రాజ్యాంగం కల్పించిన హక్కులనూ చోరీ చేస్తారని విమర్శించింది. సమావేశం అనంతరం జైరామ్ రమేశ్ మీడియాతో మాట్లాడారు. ''వచ్చే నెలలో రాహుల్ గాంధీ ఓటుచోరీపై మరిన్ని కీలక అంశాలను బయటపెడతారు. ఎన్డీయే ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి. తెలంగాణలో సీడబ్యూసీ భేటీ నిర్వహించిన ఐదు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు రెండు నెలల్లో బిహార్‌లో మహాఘట్‌బంధన్ కూటమి అధికారంలోకి రావడం ఖాయం'' అని పేర్కొన్నారు.

**మోదీ 'కౌగిలింతల దౌత్యం' బెడిసికొట్టింది**

గత పదేళ్లలో భారత విదేశాంగ విధానం కుప్పకూలిపోయిందని.. మోదీ 'కౌగిలింత దౌత్యం' బెడిసికొట్టిందని కాంగ్రెస్ విమర్శించింది. దౌత్యపరంగా మన దేశం ఒంటరిదైపోయిందని, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోలేని దుస్థితిలో పడిందని తీర్మానంలో ఆరోపించింది. ''ఎన్డీయే ప్రభుత్వం అటు అమెరికా, ఇటు చైనాల మధ్య ఊగిసలాడుతూ తెలివితక్కువగా వ్యవహరించింది. మిత్రదేశం అంటూనే భారత్‌పై ట్రంప్ భారీగా టారిఫ్‌లు విధించారు. హెచ్ 1బీ వీసాల విధానాన్ని కఠినతరం చేశారు. దీనికి ప్రతిగా మోదీ ప్రభుత్వం చైనా వైపు మళ్లింది. ఇది మరింత ప్రమాదకరం. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా ఆయుధాలు అందించింది'' అని పేర్కొంది. అమెరికా జబ్బు కంటే..చైనా పేరిట వేస్తున్న మందు మరింత ప్రమాదకరమని అభివర్ణించింది.

**మోదీ ప్రభుత్వ పతనానికి నాంది: ఖర్గే**

బిహార్‌లో జరగనున్న ఎన్నికలు భవిష్యత్తులో కేంద్రంలో మోదీ అవినీతి ప్రభుత్వ పతనానికి నాంది పలకనున్నాయని ఖర్గే పేర్కొన్నారు. ఓట్ల చోరీ, ఆర్థిక వ్యవస్థ మందగమనం, నిరుద్యోగం, సామాజిక విభజన, స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలను బలహీనం చేయడం వంటివాటితో దేశం అల్లకల్లోలం అవుతోందని ఆరోపించారు. అయితే, బిహార్‌లో మిత్రపక్షాలపై పెత్తనం చేసేందుకే పాట్నాలో సీడబ్ల్యూసీ భేటీ నిర్వహించారని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. దీనిని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా ఖండించారు.

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో ఈబీసీలకు చట్టం: రాహుల్**

**బీసీల్లో మరింత వెనుకబడిన కులాల (ఈబీసీ) వారి కోసం.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం తరహాలో ప్రత్యేక చట్టం తెస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. బిహార్‌లోని పాట్నాలో సీడబ్ల్యూసీ భేటీ అనంతరం 'ఈబీసీలకు న్యాయ సంకల్పం' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ మాట్లాడారు. బిహార్ జనాభాలో ఎక్కువశాతం ఉన్న ఈబీసీల కోసం 10 ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. ఈబీసీ అట్రాసిటీస్ చట్టం తెస్తామని, స్థానిక ఎన్నికల్లో వారి రిజర్వేషన్లను 30శాతానికి పెంచుతామని, ప్రభుత్వ కాంట్రాక్టుల్లోనూ రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చారు.**

# 71మంది మావోయిస్టుల లొంగుబాటు



ఈకబురు,:చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా పోలీసుల ఎదుట బుధవారం 71మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 21 మంది మహిళలతో పాటు ఓ బాలుడు (17), ఇద్దరు బాలికలు (16, 17) ఉన్నారు. వీరిలో 30 మందిపై రూ.64 లక్షల రివార్డు ఉంది. వీరు మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పని చేశారు. బమన్ మడ్కం (30), మాంకీ అలియాస్ షమీలా మాండవి (20)లు ఒక్కొక్కరిపై రూ.8 లక్షల చొప్పున, గంగి అలియాస్ రోహిణీ బర్సే (25), దేవె అలియాస్ కవితా మాద్వి (25), సంతోష్ మాండవి (30)లు ఒక్కొక్కరిపై రూ.5 లక్షల చొప్పున, మిగతావారిపై కూడా రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు రివార్డు ఉంది. పోలీసులపై జరిగిన పలు దాడుల్లో బమన్, షమీలా, గంగి ప్రమేయం ఉందని దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు. మిగతా మావోయిస్టులు రోడ్లు తవ్వేయడం, చెట్లు కూల్చేయడం, నక్సలైట్ల బ్యానర్లు కట్టడం, పోస్టర్లు అంటించడం, కరపత్రాలు పంచడం వంటి కార్యకలాపాల్లో పాల్గొన్నారని చెప్పారు. మావోయిస్టు పార్టీ డొల్ల సిద్ధాంతంతో విసిగిపోయామని లొంగిపోయినవారు తెలిపారని పేర్కొన్నారు. బస్తర్ రేంజ్ పోలీసులు ప్రారంభించిన పునరావాస కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త పునరావాస విధానం తమను ప్రభావితం చేశాయని చెప్పారని తెలిపారు. లొంగిపోయినవారికి రూ.50 వేల ఆర్థిక సహాయంతో పాటు పునరావాసం కల్పిస్తామన్నారు. గత 17 నెలల్లో బస్తర్ డివిజన్‌లో లాల్‌వర్రాట్ కార్యక్రమం కింద 1,113 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారిలో 297 మందిపై రివార్డులు ఉన్నాయని ఎస్పీ చెప్పారు. లొంగిపోయిన వారిలో దంతెవాడ జిల్లా నుంచి 461 మంది ఉన్నారన్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేతలు రాజు దాదా అలియాస్ కట్టా రామచంద్రారెడ్డి (63), కోసా దాదా అలియాస్ కడారి సత్యనారాయణ రెడ్డి (67) మృతిచెందిన సంగతి తెలిసిందే. ఇప్పటికే వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. తాజాగా వరుస లొంగుబాట్లతో పార్టీ మనుగడ కష్టంగా కనిపిస్తోంది.

# దేశ ద్రోహి కాంగ్రెస్.. ప్రజా ద్రోహి బీజేపీ



రైతు డిక్లరేషన్‌లో చెప్పిన ఏ ఒక్క హామీని రేవంత్ రెడ్డి అమలు చేయడం లేదని, యూరియా కోసం రైతులు రోడ్డెక్కితే పోలీసులతో కొట్టిస్తున్నారని, సూర్యాపేటలో యూరియా ఆందోళనలో పాల్గొన్న గిరిజన యువకుడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, ఈ అంశాన్ని ఎస్సీ, ఎస్టీ, మానవ హక్కుల కమిషన్ల దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాహుల్ గాంధీ చెప్పిన 'మొహబ్బత్ కీ దుకాణ్' అంటే రైతులను కొట్టడమేనా అని ప్రశ్నించారు. ఏపీ సీఎం చంద్రబాబు ప్రయోజనాల కోసమే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయించకుండా సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాగా, అధికారం కోసం అడ్డమైన హామీలు ఇచ్చి అమలు చేయకపోవడాన్ని కాంగ్రెస్ అలవాటుగా మార్చుకుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ యూనియన్ బృందం సభ్యులు బుధవారం కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిగ్ వర్కర్స్‌కు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**పీపుల్స్ ప్లాజాలో బీఆర్ఎస్ బతుకమ్మ వేడుకలు**

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు తలసాని, పద్మారావు గౌడ్, సత్యవతి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, కౌశిక్ రెడ్డి, ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, వాణిదేవి, ఎల్. రమణ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ఉద్యోగులకు బోనస్

**ఈ-కబురు,న్యూఢిల్లీ, : రైల్వే ఉద్యోగులకు ఉత్పాదకత ఆధారిత బోనస్‌ను కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఇది ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 వరకు ఉంటుందని తెలిపింది. దీనివల్ల 10,91,146 మంది ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ.. రైల్వే ఉద్యోగుల బోనస్‌కు ఆమోదముద్ర వేసింది. ఏటా దసరా పండగ వేళ ఉత్పాదకత ఆధారిత బోనస్‌ను రైల్వే ఉద్యోగులకు కేంద్రం ప్రకటిస్తోంది. 2024-25లో రైల్వే ఉద్యోగుల పనితీరు చాలా బాగుందని, 1614.9 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా జరిగిందని, 730 కోట్ల మంది ప్రయాణికులు రైల్వేలో ప్రయాణించారని ఒక ప్రకటనలో కేంద్రం తెలిపింది. సముద్ర వాణిజ్యరంగానికి పెద్ద పీట వేస్తూ నౌకల తయారీ, మౌలిక సదుపాయాల పెంపుదలకు రూ.69,725 కోట్ల భారీ ప్యాకేజీకి కేంద్ర క్యాబినెట్ అంగీకరించింది. దీనివల్ల 45 లక్షల టన్నుల నౌకా నిర్మాణ సామర్థ్యం సమకూరుతుందని, ఈ రంగంలోకి రూ.4.5 లక్షల కోట్ల పెట్టుబడులు తరలివస్తాయని, ఫలితంగా కొత్తగా దాదాపు 30 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందని కేంద్రం ఒక ప్రకటనలో వెల్లడించింది. మరోవైపు, దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో డాక్టోరల్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లకు రూ.2,277 కోట్లను కేటాయించే పథకానికి క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఎన్నికలు జరగనున్న బిహార్‌లో రూ.2,192 కోట్ల వ్యయంతో 104 కి.మీ.ల సింగిల్ రైల్వే ట్రాక్‌ను డబ్లింగ్ చేసే ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతోపాటు ఆ రాష్ట్రంలో రహదారుల విస్తరణకు రూ.3,822 కోట్ల మొత్తాన్ని కేటాయించింది.**



# బొగ్గుపై జీఎస్టీ తగ్గింపుతో విద్యుత్తు ధరలపైనా ప్రభావం




కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ఈ-కబురు,ఢిల్లీ: "కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో బొగ్గు పైనా పన్నుల భారం తగ్గింది. ఫలితంగా విద్యుత్తు ధరల పైనా దాని ప్రభావం ఉంటుంది. జీఎస్టీ తగ్గింపు కారణంగా తరతమ భేదం లేకుండా దేశంలోని 140 కోట్ల మందికీ ప్రయోజనం కలుగుతోంది. అందుకే ప్రస్తుతం దేశంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజలపై భారాన్ని తగ్గించినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు" అని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం ఢిల్లీలో జరిగిన ఎకనమిక్ టైమ్స్ ఎనర్జీ లీడర్‌షిప్ సదస్సులో మాట్లాడారు. "జీఎస్టీ 2.0 ద్వారా బొగ్గుపై ఉన్న సెస్‌ను పూర్తిగా ఎత్తివేశాం. దీంతో బొగ్గు ఆధారిత ఉత్పత్తుల రంగాల ధరలు తగ్గుతాయి. బొగ్గు గనుల రంగంలో గతంలో అవినీతి తాండవం చేసేది. ఇప్పుడు ఆ పరిస్థితులను సమూలంగా మార్చేశాం. భవిష్యత్తులో విద్యుత్తు భద్రత విషయంలో బొగ్గే ప్రధాన పోషించనుంది. 2030 నాటికి బొగ్గు డిమాండ్ 1.6 బిలియన్ టన్నులకు చేరుతుందని అంచనా. ఇప్పటికే 220 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సాధిస్తున్నాం. 2030 నాటికి దీన్ని 500 గిగావాట్లకు తీసుకెళ్లాలన్నదే లక్ష్యం. 2047 నాటికి వికసిత భారత్ సాధించేందుకు ఇంధన భద్రతతో పాటు పర్యావరణ సుస్థిరత చాలా ముఖ్యం. ఈ రెండు లక్ష్యాలను సాధించేందుకు బొగ్గు, గనుల మంత్రిత్వశాఖ అంకితభావంతో పనిచేస్తోంది" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.**

# నేడో, రేపో రిజర్వేషన్ల జీవో!

మొదటి పేజీ తరువాయి



ఈకబురు,హైదరాబాద్ : స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధించిన ప్రత్యేక జీవో.. గురు లేదా శుక్రవారం విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే ముందుగా విద్యా, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీ సంక్షేమశాఖ లేదా ప్రణాళిక శాఖ జీవో జారీ చేస్తుందని సమాచారం. ఈ జీవో వచ్చాకే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించి జీవో ఇవ్వాల్సి ఉంటుందని తెలుస్తోంది.

అయితే ఈ రెండు జీవోలు వెంట వెంటనే వెలువడే అవకాశాలు కూడా కొట్టిపారేయలేమని అధికారవర్గాల సమాచారం. కాగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించి జీవో జారీ అయ్యి తమకు అందిన వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఆగమేఘాలపై ఎన్నికల షెడ్యూల్ జారీ చేసే అవకాశాలున్నాయని అంటున్నారు. మరుసటిరోజు నోటిఫికేషన్‌ను విడుదల చేయొచ్చునని తెలుస్తోంది.

పీఆర్ శాఖ కసరత్తు ముమ్మరం

బుధవారం సచివాలయంలోని పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో.. పీఆర్ఆర్‌డీ డైరెక్టర్, ఇతర అధికారులు ఇప్పటికే ఖరారైన రిజర్వేషన్లకు అనుగుణంగా జీవో జారీకి కసరత్తు నిర్వహించినట్టు తెలిసింది. బుధవారంలోగా రిజర్వేషన్ల ఖరారు సమాచారాన్ని అందించాలంటూ కలెక్టర్లను పంచాయతీరాజ్ శాఖ ఆదేశించిన సంగతి తెలిసిందే.

కాగా ఈ మేరకు అందిన సమాచారాన్ని అధికారులు క్రోడీకరించి పెట్టుకున్నట్టు తెలుస్తోంది. అంతకుముందు జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగిన రిజర్వేషన్ల ఖరారు చేసిన కసరత్తును బుధవారం సైతం సీఎస్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి, పీఆర్ఆర్‌డీ డైరెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షించారు.

ఎన్నికలు అసలు ఉంటాయా?

స్థానిక ఎన్నికలకు వివిధ శాఖల పరంగా సన్నాహాలు ముమ్మరంగా సాగుతుండగా.. మరోవైపు అసలు స్థానిక ఎన్నికలు ఉంటాయా? అనే సందేహాలు కూడా కొందరు వ్యక్తం చేస్తున్నారు. బీసీలకు 42 శాతం జీవో న్యాయస్థానాల్లో నిలబడకపోయినా, ఇతరత్రా ఆటంకాలు ఏవైనా ఎదురైనా ఎన్నికలు ఆగే అవకాశం ఉందని అంటున్నారు.

అయితే ఈ నెలాఖరుకల్లా ఎన్నికలు జరపాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు జరుగుతున్న కసరత్తును, రిజర్వేషన్ల అంశాన్ని హైకోర్టుకు తెలియజేసి..ఎన్నికల నిర్వహణకు మరింత గడువు అంటే నవంబర్ ఆఖరులోగా నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతికోరే అవకాశం ఉందని అంటున్నారు.

రిజర్వేషన్ల ఖరారు ఇలా..

నూతన పీఆర్ చట్టానికి అసెంబ్లీ ఆమోదించిన సవరణలకు అనుగుణంగా డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఎస్టీ, ఎస్సీ, బీసీలు ఇలా అన్ని కేటగిరీల్లో మహిళలకు 50 శాతం రిజర్వ్ చేశారు. షెడ్యూల్డ్ ఏరియాల్లో రిజర్వేషన్ సీట్లన్నీ కూడా ఎస్టీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా, మొత్తం సీట్లలో 50 శాతానికి తగ్గకుండా చేశారు.

ఈ ఏరియాల్లోని మండల అధ్యక్షుల పదవులన్నీ కూడా ఎస్టీలకే రిజర్వ్ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ రిజర్వేషన్ల ఖరారును పంచాయతీరాజ్ కమిషనర్, మండల అధ్యక్షులు, జెడ్పీటీసీ స్థానాలను జిల్లా కలెక్టర్లు, మండలాల్లో ఎంపీటీసీ రిజర్వేషన్లను ఆర్డీవోలు ఖరారు చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా లెక్కల ఆధారంగా... బీసీ రిజర్వేషన్లను కులగణన (ఎస్ఈఈఈపీసీ) సర్వే 2024 ప్రకారం పూర్తి చేశారు.




# సందర్శకుల శునకాలపై సుంకం



ఇటలీలోని పర్యాటక నగరం

ఈకబురు,పర్యాటకుల వెల్లువ నుంచి తమ ప్రాంతాల స్థానిక ప్రత్యేకతలను సంరక్షించుకోవడానికి ఇటీవల కొన్ని దేశాలు సందర్శకులపై పన్ను విధిస్తున్న విషయం తెలిసిందే. ఇదే కోవలో తమ నగరం పరిశుభ్రతను కాపాడుకోవడానికి సందర్శకుల వెంట వచ్చే శునకాలపైనా సుంకం విధించాలని ఉత్తర ఇటలీలోని ప్రముఖ పర్యాటక నగరం బొల్జానో నిర్ణయించింది. వచ్చే ఏడాది జనవరి నుంచి ఇది అమలు కానుంది. రోజుకు సుమారు రూ.156 (1.50 యూరో)లు శునక యజమానులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రసిద్ధ డోలమైట్ పర్వతాలను సందర్శించాలనుకునే యాత్రికులకు ఈ ప్రాచీన నగరం ప్రవేశ ద్వారం కనుకే ఇక్కడ పర్యాటకుల రద్దీ అధికం. పర్యాటకులే కాదు స్థానిక నగరవాసులు కూడా ఒక్కో శునకాన్ని పెంచుకుంటున్నందుకు గాను ఏడాదికి సుమారు రూ.10,400 (100యూరో)ల పన్ను చెల్లిస్తున్నారు. శునకాల మల,మూత్రాలను తొలగించి వీధులను, పార్కులను పరిశుభ్రంగా ఉంచడం కోసమే ఈ పన్ను విధిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ యంత్రాంగం చెబుతోంది. అలాగే కుక్కల డీఎన్ఏ నమోదు కోసం కూడా కొంత రుసుము విధిస్తున్నారు. పెంపుడు జంతువుల యజమానులు వీధుల్లో తమ శునకం మలాన్ని తొలగించకుండా వెళితే డీఎన్ఏ ద్వారా గుర్తించి వారికి రూ.62,500 (600యూరో)లు జరిమానా విధిస్తారట. ఇప్పటికే శునకం డీఎన్ఏ నమోదు చేసిన వారికి రెండేళ్ల పాటు పన్నులో రాయితీ ఉంటుందని కొత్త విధానానికి ఆద్యుడైన ప్రొవిన్షియల్ కౌన్సిలర్ లూయిా వాల్చర్ తెలిపారు. అయితే, పెంపుడు జంతువులను కూడా పన్నుల పరిధిలోకి తీసుకురావడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రాచీన నగర ప్రాముఖ్యతను కాపాడుకుంటూ పర్యాటకహితంగా కొనసాగించడానికి ఈపాటి జాగ్రత్తలు అవసరమేనని అధికారులు అంటున్నారు.

# బీసీ రిజర్వేషన్ల అమలుకు చిత్తశుద్ధితో కృషి: సీఎం



సీడబ్ల్యూసీ సమావేశంలో సీఎం

**ఈ-కబురు,హైదరాబాద్ : హైదరాబాద్: తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి అమలు కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం బిహార్‌లోని పట్నాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంతో పాటు కమిటీ శాశ్వత ఆహ్వానితులు మంత్రి దామోదర్ రాజనర్సింహ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశంలో పాల్గొన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన 'ఓట్ చోర్- గద్దీ ఛోడ్' నినాదంతో చేపట్టిన కార్యక్రమాన్ని తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో విజయవంతంగా నిర్వహించినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. బీసీలకు 42 రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల గురించి ఆయన సమావేశంలో వివరించినట్లు సమాచారం.**

**అక్రమంగా అధికారంలోకి భాజపా**

**-మహేశ్‌గౌడ్**

**ఎన్నికల కమిషన్ అండతో కేంద్రంలో భాజపా మూడోసారి అక్రమంగా అధికారంలోకి వచ్చిందని ప్రజలు నమ్ముతున్నారని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ... "ఎన్నికల కమిషన్‌పై, భాజపాపై రాహుల్ గాంధీ పకడ్బందీ సాక్ష్యాలతో వేసిన 'ఓట్ చోరీ బాంబులు' బాగా పేలాయి. ప్రజా పోరాటంలో భాజపాపై కాంగ్రెస్ నైతిక విజయం సాధించింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం చర్యలు తీసుకుని దేశానికి రోల్ మోడల్‌గా నిలిచింది" అని ఆయన చెప్పారు.**

**డీసీసీ అధ్యక్షుల నియామకాలపై నేడు పరిశీలకులతో సమావేశం**

**జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుల నియామకాల కోసం ఇప్పటికే పలు రాష్ట్రాలకు పరిశీలకులను నియమించిన ఏఐసీసీ... వారికి దిశానిర్దేశం చేసేందుకు గురువారం ఏఐసీసీ కార్యాలయం ఇందిరా భవన్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసింది. తెలంగాణకు నియమితులైన 22 మంది పరిశీలకులు దీనికి హాజరు కానున్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపారు. దసరా అనంతరం అక్టోబరు 4 నుంచి క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలని పరిశీలకులకు పార్టీ ఇప్పటికే సూచించింది. డీసీసీ అధ్యక్ష పదవుల కోసం ఒక్కో జిల్లాకు ముగ్గురు అభ్యర్థుల పేర్లను పరిశీలకులు సిఫార్సు చేయాలి.**



# గంగకూ తప్పని బెంగ

**1991 నుంచి 2020 మధ్య నదీ పరీవాహక ప్రాంతంలో దుర్భిక్షం**

**తాజా అధ్యయనంలో వెల్లడి**

**ఈ-కబురు,ఢిల్లీ: ఇటీవల దశాబ్దాల్లో గంగా నది ఎండిపోతున్న పరిస్థితులు అత్యంత తీవ్రంగా, అసాధారణంగా ఉన్నాయని తాజా అధ్యయనం పేర్కొంది. దీని ఫలితంగా కోట్ల మంది ప్రజలకు ఆహార, నీటి ముప్పు పొంచి ఉందని తెలిపింది. ఈ మేరకు 1,300 సంవత్సరాల గణాంకాలను విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని వెల్లడించారు. గత వెయ్యి సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా 1991 నుంచి 2020 మధ్య కాలంలో గంగా నదీ పరీవాహక ప్రాంతంలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంది. జూన్-సెప్టెంబరు మధ్యకాలానికి సంబంధించిన నైరుతి రుతుపవన కాలంలో వర్షపాతం తగ్గిపోవడమే ఈ పరిస్థితులకు కారణమని ఈ అధ్యయనం చేపట్టిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గాంధీనగర్, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఆరిజోనాలకు చెందిన పరిశోధకులు వెల్లడించారు. 1990ల్లో గంగా పరీవాహక ప్రాంతాల్లోని దుర్భిక్ష పరిస్థితులు 16వ శతాబ్దంలో సంభవించిన కరవుతో పోల్చితే 76 శాతం తీవ్రమైనవని పరిశోధకులు పేర్కొన్నారు. 1951-2020 మధ్యకాలంలో దేశ వార్షిక వర్షపాతంలో 9.5 శాతం తగ్గుదల నమోదైందని, అందులోనూ దేశ పశ్చిమ ప్రాంతంలో తగ్గుదల 30 శాతానికిపైగా ఉందని తెలిపారు. వాతావరణ మార్పుల కారణంగా వర్షపాతం పెరగడం, హిమానీనదాల కరుగుదల సంభవించడం వంటి కారణాలతో నదిలో నీటి ప్రవాహం పెరుగుతుందని మునుపటి అధ్యయనాలు అంచనా వేసినా.. వేడి పరిస్థితుల కారణంగా భవిష్యత్తులో నీటి లభ్యతపై అంచనాలు సంక్లిష్టంగా ఉంటాయని పేర్కొన్నారు.**

# యాదగిరిగుట్ట కొండపైకి రోప్‌వే



**నాగార్జునకొండ, నల్గొండ హనుమాన్‌కొండ, మంథని రామగిరికోటలోనూ ఏర్పాటు**

**పర్వతమాల ప్రాజెక్టులో మంజూరు**

ఈకబురు,హైదరాబాద్: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం కొండపైకి వెళ్లే భక్తులకు మరింత మెరుగైన సదుపాయం కలగనుంది. పర్వతమాల పరియోజన ప్రాజెక్టులో భాగంగా గుట్టపైకి వెళ్లేందుకు రోప్‌వే ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతోపాటు రాష్ట్రంలో మరో మూడు చోట్ల రోప్‌వేలను ఏర్పాటు చేయనున్నారు. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) పరిధిలోని జాతీయ రహదారుల లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఎన్‌హెచ్‌ఎల్‌ఎంఎల్)కు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 1.1కి.మీ., నల్గొండ జిల్లాకేంద్రంలోని హనుమాన్‌కొండకు 1.2కి.మీ., నాగార్జునకొండ నుంచి నాగార్జునసాగర్ డ్యామ్ వరకు 1.7కి.మీ., పెద్దపల్లి జిల్లా మంథనిలోని రామగిరికోటకు 2.4 కి.మీ.మేర రోప్‌వే ఏర్పాటుకు సన్నాహాలు చేయనున్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) కోసం ఎన్‌హెచ్‌ఏఐ బిడ్‌లను ఆహ్వానించింది. అక్టోబర్ 21 వరకు బిడ్‌ల సమర్పణకు అవకాశం కల్పించారు. కేంద్రం దేశవ్యాప్తంగా 200 రోప్‌వేలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా తాజాగా ఉత్తరాఖండ్‌లో రెండు, తెలంగాణలో 4రోప్‌వేలకు పచ్చజెండా ఊపి, ప్రక్రియ ప్రారంభించింది.

తీరనున్న కష్టాలు..


వారాంతాలు, పర్వదినాల్లో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఘాట్‌రోడ్‌పై వాహనాలు బారులు తీరుతున్నాయి. గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ ఆలయానికి రోప్‌వేను ఏర్పాటు చేస్తే భక్తులు నేరుగా కొండపైకి వెళ్లవచ్చు. బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్‌లోని నాగార్జునకొండకు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. కృష్ణానదిపై నుంచి రోప్‌వే ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు హనుమాన్‌కొండలో రోప్‌వే ఏర్పాటు చేయనున్నారు.

కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం,మంథనిరామగిరి కోటను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయడంలో

# పక్క రాష్ట్రాల ప్రయోజనాలే ఎక్కువా?

ఈకబురు,హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వానికి సొంత రాష్ట్రం కంటే పక్క రాష్ట్ర ప్రయోజనాలే ఎక్కువా? అని భారత రాష్ట్ర సమితి సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఓ వైపు ఏపీ ప్రభుత్వం బనకచర్ల నుంచి గోదావరి జలాలను తరలించుకుపోవాలని ప్రయత్నిస్తున్నా.. మరోవైపు ఆలమట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపుపై కర్ణాటక ప్రభుత్వం కసరత్తు చేస్తున్నా.. తెలంగాణ ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. "కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎవరికి తోచినట్లుగా వారు కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. జులై 14, 2014న కృష్ణాలో తెలంగాణకు 299 టీఎంసీల కేటాయింపు అన్యాయమని కేంద్రానికి లేఖ రాశాం. మేం ఆనాడు ఒప్పుకొని ఉంటే.. సెక్షన్ 3 కోసం ఎందుకు కొట్లాడేవాళ్లం? సుప్రీంకోర్టును ఎందుకు ఆశ్రయించేవాళ్లం? సమ్మక్కసాగర్ బ్యారేజీ విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఇప్పటికైనా ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మౌనం వీడాలి' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



# లాభల్లో 'బంగారు' కొండ



**నిఫ్టీని మించి ప్రతిఫలం పంచిన పసిడి**
**వరుసగా ఇది మూడో ఏడాది**

దీపావళి పండగ అంటే పసిడి ధగధగలే. మహిళలకు అత్యంత ఆకర్షణీయమైన బంగారం, పెట్టుబడుల రీత్యా కూడా ఈక్విటీల కంటే అధిక ప్రతిఫలాన్ని ఇవ్వడంతో మధ్యతరగతి వారు కూడా అటువైపు దృష్టి సారిస్తున్నారు. ఒక దీపావళి నుంచి మరుసటి ఏడాది దీపావళి వరకు 'సంవత్'గా వ్యవహరించి, ఈక్విటీలపై ఎంత ప్రతిఫలం వచ్చిందీ లెక్కలేసుకుంటుంటారు. ఈ సందర్భంగానే దీపావళి పండగ రోజు మార్కెట్లకు సెలవే అయినా, ఒక గంటపాటు ప్రత్యేక మూరత్ ట్రేడింగ్ నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కూడా అక్టోబరు 21న ఇది జరగనుంది. గత 8 సంవత్సరాల్లో ఏడేళ్ల పాటు సంవత్ కాలంలో నిఫ్టీ 50 ఇచ్చిన ప్రతిఫలం కంటే, పసిడిపై పెట్టుబడులే అధిక ప్రతిఫలాలు అందించాయి.

ఆర్థిక అనిశ్చితుల సమయంలో, ద్రవ్యోల్బణం కోరలు చాస్తున్నప్పుడు సురక్షిత పెట్టుబడి సాధనంగా బంగారాన్ని పరిగణిస్తుంటారు. ఎప్పుడైనా నగదుగా మార్చుకునేందుకు/తాకట్టుపై అయినా సొత్తును సమకూర్చుకునేందుకు బంగారం ఉపయోగపడుతుందని భావిస్తుంటారు. వివిధ దేశాల ఉత్పత్తులపై అమెరికా సుంకాలు విధిస్తుండటం, మన దేశీయులు- ముఖ్యంగా తెలుగువారు అమెరికాలో ఐటీ ఉద్యోగాలు పొందేందుకు ఉపకరించిన హెచ్-1బీ కొత్త వీసా రుసుమును లక్ష డాలర్ల (సుమారు రూ.88 లక్షల)కు పెంచిన నేపథ్యంలో.. ఆర్థిక పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. ఈ నేపథ్యంలో రూపాయి అంతకంతకూ బలహీనపడుతోంది. ప్రస్తుతం అమెరికా డాలర్ రూ.88.75కు చేరడం మరింత కలవరపెడుతోంది. బంగారం కోసం దిగుమతులపైనే ఆధారపడటం, ఇందుకు డాలర్లే వినియోగించాల్సి రావడంతో.. డాలర్ విలువ పెరిగే కొద్దీ, దేశీయంగా పుత్తడి ధరలు మరింత అధికమవుతున్నాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యా విదేశీ మారకద్రవ్యాన్ని పాశ్చాత్య దేశాల బ్యాంకులు స్తంభింపచేయడం వల్ల.. వివిధ దేశాల కేంద్రీయ బ్యాంకులు కూడా, పసిడి నిల్వలను పెంచుకుంటున్నాయి. భారత్ సహా పలు దేశాల విదేశీ మారకపు ద్రవ్య నిల్వల్లో బంగారం వాటా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం ధర 3791 డాలర్ల గరిష్ఠస్థాయికి చేరి, ప్రస్తుతం 3735 డాలర్ల వద్ద కదలాడుతోంది. దేశీయంగా 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.1,16,400కు, కిలో వెండి ధర రూ.1,38,000కు చేరింది. 10 గ్రాముల బంగారం రూ.లక్ష కంటే కిందకు దిగిరాదా అని కొనుగోలుదార్లు ఎదురు చూస్తున్నారు. ఇదే సమయంలో కమొడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసీఎక్స్‌లో, లోహం రూపేణ బిస్కెట్ల రూపంలో పెట్టుబడుల రీత్యా కొనుగోలు చేసినవారు మాత్రం ఖుషీగా ఉన్నారు. వెండి కూడా నిఫ్టీ50కి మించి ప్రతిఫలాన్ని ఇవ్వడం ఇది వరుసగా మూడో ఏడాది.

గత దీపావళి నుంచి చూస్తే ఇప్పటికే బంగారం ధర దాదాపు 35% పెరిగింది. ఇదే సమయంలో నిఫ్టీ 50 సూచీపై ప్రతిఫలం 5% లోపే ఉంది. గత ఏడాది కూడా నిఫ్టీపై 24% లాభం ఆర్జిస్తే, బంగారంపై 32% లభించింది. 2023లో కూడా నిఫ్టీపై 10% , పుత్తడిపై 21% ప్రతిఫలం లభించింది.

**వెండి ఆభరణాల దిగుమతిపై ఆంక్షలు:** స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దుర్వినియోగం కాకుండా చూసేందుకు, వెండి ఆభరణాల దిగుమతిపై వచ్చే మార్చి ఆఖరు వరకు ఆంక్షలు విధిస్తున్నటు ప్రభుత్వం బుధవారం ప్రకటించింది.

**అంతర్జాతీయ సంస్థలు ఏమంటున్నాయ్?** ఔన్సు (31.10 గ్రా) బంగారం ధర 5,000 డాలర్ల(గ్రాము రూ.15,500) కు చేరే అవకాశం ఉందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేస్తోంది. జెఫ్రీస్‌లోని ఈక్విటీస్ వ్యూహకర్త క్రిస్ వుడ్ అయితే ఔన్సు బంగారం 6,600 డాలర్ల (గ్రాము రూ.20,500)కు చేరుతుందని పేర్కొన్నారు.

# సెమీకండక్టర్ రంగంలో 22% తగ్గిన నియామకాలు



**అత్యంత నిపుణులకే ప్రాధాన్యం**

ముంబయి: సెమీకండక్టర్ డిజైన్ కోసం అంతర్జాతీయ సంస్థలు మనదేశంలో నెలకొల్పిన గ్లోబల్ కేపబులిటీ సెంటర్ (జీసీసీ)లలో అత్యధిక నైపుణ్యాలున్న వారినే నియమించుకుంటున్నారు. గతంలో సంఖ్యాపరంగా ఎక్కువమందికి అవకాశం ఇవ్వగా, ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మాత్రం అధునాతన నైపుణ్యాలున్న వారిని మాత్రమే నియమించుకోవడానికి కంపెనీలు ప్రాధాన్యమిచ్చినట్లు టాలెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ కెరీర్‌నెట్ నివేదిక వెల్లడించింది. 2024-25 ఇదే కాలంతో పోలిస్తే 2025-26 ఏప్రిల్-జూన్‌లో 50 సెమీకండక్టర్ జీసీసీల్లో మొత్తం నియామకాలు 22% తగ్గాయని నివేదిక పేర్కొంది. కోర్ వీఎల్ఎస్ఐ నైపుణ్యాలకు (48%), సిస్టమ్, అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ (35%), బిజినెస్ ఆపరేషన్లు/ఐటీ సహాయక (17%) నైపుణ్యాలు కలిగిన వారికి వీటిల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. డిజిటల్ డిజైన్ (15%), వెరిఫికేషన్ (10%), సిస్టమ్ సాఫ్ట్‌వేర్ (10%) వంటి ఉద్యోగాలూ ఉంటున్నాయి. లీడర్‌షిప్, సాధారణ సహాయక పోస్టులకు ఈ సంస్థలు ప్రాధాన్యమివ్వడం లేదని నివేదిక తెలిపింది.

79 పెద్ద, మధ్య, అంకుర సంస్థల సెమీకండక్టర్ జీసీసీల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు కెరీర్‌నెట్ తెలిపింది

# అమెరికాతో ఇంధన వాణిజ్యం పెరగొచ్చు!

**కేంద్ర మంత్రి పీయూష్ గోయల్**

వాషింగ్టన్: రాబోయే సంవత్సరాల్లో అమెరికాతో మనకు ఇంధన ఉత్పత్తుల వాణిజ్యం పెరిగే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. మన దేశ ఇంధన భద్రత లక్ష్యాల్లో అమెరికా కీలక పాత్ర పోషించనుందని వెల్లడించారు. ఇంధన రంగంలో భారత్ అతిపెద్ద వినియోగదారని, అమెరికా సహా ప్రపంచ దేశాల నుంచి భారీ స్థాయిలో ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోందని అన్నారు. న్యూయార్క్‌లో కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా, అమెరికాఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్, రీన్యూ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. 'రాబోయే సంవత్సరాల్లో అమెరికాతో ఇంధన ఉత్పత్తుల పరంగా మా వాణిజ్యాన్ని పెంచుకోవాలని చూస్తున్నాం. మిత్రులు, సహజ భాగస్వాములు కావడంతో మా ఇంధన లక్ష్యాల్లో అమెరికా పాత్ర ఎక్కువగా ఉటుంది. ఇందువల్ల ధరల్లో స్థిరత్వం, భారత్‌కు విభిన్న ఇంధన వనరులు లభిస్తాయి' అని గోయల్ తెలిపారు.

**వేర్వేరు స్థాయుల్లో వాణిజ్య చర్చలు:** వాణిజ్య, వాణిజ్యేతర అంశాలపై భారత్, అమెరికా మధ్య వివిధ స్థాయుల్లో చర్చలు జరుగుతున్నాయని ఒక అధికారి వెల్లడించారు. వాణిజ్య చర్చల కోసం ప్రస్తుతం అమెరికాలో మంత్రి గోయల్ బృందం ఉంది. ఆయనతో పాటు మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, ప్రత్యేక కార్యదర్శి, భారత ప్రధాన అనుసంధానకర్త రాజేశ్ అగర్వాల్ ఉన్నారు. ఈ వారం చివర్లో అమెరికా నుంచి ఈ బృందం తిరిగి వచ్చే అవకాశం ఉంది. అమెరికా వాణిజ్యమంత్రితో కూడా గోయల్ చర్చలు జరిపారు. ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై అమెరికా ముఖ్య అనుసంధానకర్త బ్రెండన్ లించ్, అగర్వాల్ మధ్య ఇటీవల దిల్లీలో ఒకరోజు పాటు జరిగిన చర్చల అనంతరం, ఈ పర్యటన జరుగుతోంది. వాణిజ్య ఒప్పందంపై అమెరికా బృందంతో చర్చలు సానుకూలంగా జరిగాయని, ఒప్పందాన్ని ముందస్తుగా, పరస్పర ప్రయోజనకరంగా ముగించేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ నెల 16న పేర్కొంది.



# జనవరి నుంచి ఏటీఎంల ద్వారా ఈపీఎఫ్ఓ నగదు ఉపసంహరణ!

ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) నుంచి చందాదార్లు తమ నిధులు ఉపసంహరించుకుంటే, తొలుత బ్యాంకు ఖాతాలోకి చేరేవి. అక్కడ నుంచి మనకు అనువైన రీతిలో తీసుకునేవారం. ఇకపై చందాదార్లు తమ ఈపీఎఫ్ఓ ఖాతాలోని నిధుల్లో కొంతభాగాన్ని, ఏటీఎం ద్వారా నగదు రూపేణ ఉపసంహరించుకునే అవకాశం 2026 జనవరి నుంచి అమల్లోకి తీసుకురావొచ్చని తెలుస్తోంది. వచ్చే నెల రెండో వారంలో జరగబోయే బోర్డు సమావేశంలో ఈపీఎఫ్ఓ నిర్ణయాధికార సంస్థ అయిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్(సీబీటీ) ఇందుకు ఆమోదముద్ర వేయొచ్చని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల వార్తా సంస్థ 'మనీకంట్రోల్' తెలిపింది. ఇందుకు సంబంధించిన ఐటీ మౌలిక వసతులతో ఈపీఎఫ్ఓ సిద్ధంగా ఉందని సీబీటీ సభ్యుడొకరు తెలిపినట్లు వివరించింది. ఈపీఎఫ్ఓ చందాదార్లకు ఏటీఎం నుంచే నగదు ఉపసంహరణకు వీలు కల్పించడం కోసం బ్యాంకులు, ఆర్‌బీఐతో కార్మిక శాఖ మాట్లాడినట్లు ఆ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఏటీఎం ద్వారా నగదు తీసుకోవడానికి చందాదార్లకు ఈపీఎఫ్ఓ ఒక ప్రత్యేక కార్డు జారీ చేసే అవకాశం ఉంది.

# రూ.12వేల కోట్ల ఫోన్‌పే మెగా ఐపీఓ..!




ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే మెగా ఐపీఓ కోసం చర్యలు మొదలుపెట్టింది. దానిద్వారా రూ.12వేల కోట్ల మొత్తాన్ని సమీకరించేందుకు సెబీ వద్ద డ్రాఫ్ట్ పేపర్లు దాఖలు చేసినట్లు ఆంగ్ల మీడియా కథనం వెల్లడించింది. దేశీయ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయ్యేందుకు వాల్‌మార్ట్‌కు చెందిన ఈ డిజిటల్ చెల్లింపుల సంస్థ.. విశ్వసనీయమైన ప్రీ-ఫైలింగ్ రూట్‌లో ఐపీఓ కోసం దాఖలు చేసినట్లు సమాచారం. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ఈ మొత్తాన్ని సమీకరించాలని చూస్తోంది .

వాటాదారులైన వాల్‌మార్ట్, టైగర్ గ్లోబల్, మైక్రోసాఫ్ట్ ఈ ఆఫర్ ఫర్ సేల్‌లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. పదిశాతం వాటాను దీనికింద విక్రయానికి పెట్టనున్నట్లు సమాచారం. 2015 డిసెంబర్‌లో సమీర్ నిగమ్, రాహుల్ చారి, బర్జిన్ ఇంజినీర్ ఫోన్‌పేను ప్రారంభించారు. 2016లో ఇది లైవ్‌లోకి వచ్చింది. ఈ పదేళ్ల ప్రయాణాన్ని పురస్కరించుకొని.. 'భారతీయ స్టాక్ మార్కెట్లలో ఫోన్‌పేను నమోదు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం' అని ఈ ఏడాది ప్రారంభంలో ఫోన్‌పే వెల్లడించింది.

# ఇకపై ఖతార్‌లోనూ యూపీఐ చెల్లింపులు

భారతీయులు ఇకపై ఖతార్‌లో కూడా యూపీఐ (UPI) ద్వారా చెల్లింపులు చేయొచ్చని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) ప్రకటించింది. ఇందుకోసం ఖతార్ నేషనల్ బ్యాంక్‌తో ఎన్‌పీసీఐ ఇంటర్నేషల్ పేమెంట్స్ లిమిటెడ్ (NIPL) భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఈ సదుపాయం ద్వారా ఖతార్‌లోని వ్యాపార సంస్థలకూ యూపీఐ చెల్లింపులు చేయొచ్చు. నెట్‌స్టార్స్ పేమెంట్ సొల్యూషన్ సహకారంతో ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది.ఖతార్‌ను అత్యధికంగా సందర్శించే వారిలో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. భారతీయ ప్రయాణికులు పర్యాటక ఆకర్షణీయ ప్రాంతాల్లో, ఖతార్ డ్యూటీ ఫ్రీ అవుట్‌లెట్‌ల్లో సజావుగా యూపీఐ చెల్లింపులు చేయడానికి వీలు కల్పిస్తుందని ఎన్‌పీసీఐ తెలిపింది. దీని ద్వారా భారత టూరిస్టులు ఇకపై కరెన్సీ మార్పిడి లేకుండానే సులభంగా డిజిటల్ లావాదేవీలు చేయొచ్చు. ఖతార్‌తో పాటు భూటాన్, ఫ్రాన్స్, మారిషస్, నేపాల్, సింగపూర్, శ్రీలంక, యూఏఈ వంటి ఏడు దేశాల్లో ఇప్పటికే యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

# ఓజీ.. పవన్‌కల్యాణ్ గ్యాంగ్‌స్టర్ డ్రామా ఎలా ఉంది?

## రివ్యూ




**చిత్రం: ఓజీ;**
**నటీనటులు: పవన్‌కల్యాణ్, ఇమ్రాన్ హష్మీ, ప్రియాంక మోహన్, అర్జున్ దాస్, ప్రకాశ్‌రాజ్, శ్రియారెడ్డి, శుభలేఖ సుధాకర్, తేజ్ సప్రు, హరీశ్ ఉత్తమన్, రాహుల్ రవీంద్రన్, అభిమన్యు సింగ్ తదితరులు; సంగీతం: తమన్; ఎడిటింగ్: నవీన్ నూలి; సినిమాటోగ్రఫీ: రవి కె.చంద్రన్, మనోజ్ పరమహంస; నిర్మాత: డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి; రచన, దర్శకత్వం: సుజీత్; విడుదల: 25-09-2025**

ఈ ఏడాది తెలుగు సినీ ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూసిన చిత్రాల్లో 'ఓజీ' ఒకటి. అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్ నటించిన మరో గ్యాంగ్‌స్టర్ సినిమా ఇది. సుజీత్ దర్శకత్వం వహించారు. మరి ఓజాస్ గంభీర పాత్రలో పవన్ తెరపై ఎలా విజృంభించారు? ఎలాంటి థ్రిల్ పంచారు?

కథేంటంటే.. అనగనగా ఒక రాజు. అతనికి రక్షణగా నిలిచిన ఓ యోధుడు. కానీ, శత్రువుల ప్రార్థనలు ఫలించి ఆ యోధుడు పదేళ్లపాటు కన్నతండ్రిలాంటి రాజుకి దూరమవుతాడు. ఇదే అదనుగా శత్రు మూక చెలరేగిపోతుంది. ఆ రాజుని ఇబ్బందులపాలు చేసి, అతని రాజ్యాన్ని అక్రమ కార్యకలాపాలకి అడ్డాగా మార్చే ప్రయత్నం చేస్తుంది. రాజుకీ, రాజ్యానికీ కష్టం వచ్చిందని తెలిశాక ఆ యోధుడు మళ్లీ తిరిగొచ్చాడు. అతను వచ్చాక ఏం జరిగిందన్నదే ఈ కథ. ఇందులో రాజు సత్య దాదా (ప్రకాశ్‌రాజ్) అయితే, ఆయనకి రక్షణగా నిలిచిన యోధుడే ఓజాస్ గంభీర అలియాస్ ఓజీ (పవన్ కల్యాణ్). సత్య దాదానీ, ఆయన రాజ్యంలాంటి పోర్ట్‌ని కష్టాల పాలు చేసేందుకు వచ్చిన వాడే ఓమి (ఇమ్రాన్ హష్మీ). క్రూరమైన మనస్తత్వమున్న ఓమిని... ఓజీ ఎలా ఎదుర్కొన్నాడు? ఓమి వెనక ఎవరున్నారు? అసలు ఈ ఓజీ ఎవరు? అతనికీ జపాన్‌లోని సమురాయ్ వంశానికీ సంబంధం ఏమిటి?తన పేరు చెబితే ముంబై అండర్ వరల్డ్ ఎందుకు గడగడలాడిపోతుంది? పదేళ్ల తర్వాత కూడా మళ్లీ శత్రువుల్ని అదే స్థాయిలో భయపెట్టాడా లేదా? ) తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

ఎలా ఉందంటే.. తాము ఆరాధించే కథానాయకుడి సినిమాలోని ప్రతి సన్నివేశం ఓ క్లైమాక్స్‌లా ఉండాలని ఆశపడతారు మెజార్టీ అభిమానులు. పవన్‌కల్యాణ్‌కి వీరాభిమాని అయిన సుజీత్ (og movie director) కూడా అవే ఆలోచనలతో 'ఓజీ' తీసినట్టు అనిపిస్తుంది. అచ్చంగా సినిమా నిండా ఫ్యాన్ బాయ్ మూమెంట్సే. పవన్ ఇమేజ్‌కి, ఆయన స్వాగ్‌కి తగ్గట్టుగా ఆయుధాలు చేతికందించి... మరింత స్టైలిష్‌గా ఆయన్ని తెరపై ఆవిష్కరిస్తూ... అడుగడుగునా క్లైమాక్స్‌ని మించిపోయే ఎలివేషన్స్‌తో తెరపై అగ్ని తుఫాన్‌ని ఆవిష్కరించారు సుజీత్. ఆయనికి తమన్ (og movie music director) తోడవడం ఇంకా కలిసొచ్చింది. విజువల్స్ కూడా కట్టిపడేస్తాయి. మొత్తంగా అభిమానులు సంతృప్తి చెందే సినిమా ఇది.మిగతా ప్రేక్షకుల్ని మెప్పించాలంటే మాత్రం కథతోనూ, డ్రామాతోనూ కట్టిపడేయాల్సిందే. సుజీత్‌లోని అభిమాని కథ, డ్రామా కంటే కూడా ఇతర అంశాలపైనే ఎక్కువగా దృష్టిపెట్టినట్టు అనిపిస్తుంది. జపాన్‌లోని యకుజా, సమురాయ్ వంశాల మధ్య కథని చెబుతూ ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాని మొదలుపెట్టాడు దర్శకుడు. ఆరంభ సన్నివేశాలు ప్రేక్షకుడిని ఓ కొత్త కథా ప్రపంచంలోకి తీసుకెళతాయి. ఆ తర్వాత కథ ముంబైకి మారుతుంది. పవన్‌కల్యాణ్ పరిచయ సన్నివేశాల నుంచి ఎలివేషన్స్ హంగామా మొదలవుతుంది. ముంబైలో రక్తపుటేర్లు పారించిన ఓజీ గతం తాలూకు సన్నివేశాలు మొదలుకొని, పదేళ్ల తర్వాత తిరిగి ముంబైలోకి అడుగు పెట్టినప్పటి సన్నివేశాల వరకూ ప్రతి ఎలివేషన్, యాక్షన్ సీక్వెన్స్ సినిమాపై బలమైన ప్రభావం చూపించాయి.

విరామానికి ముందు, ఆ తర్వాత వచ్చే సన్నివేశాలు సినిమాకి హైలైట్. పోలీస్ స్టేషన్‌లో సన్నివేశాలు రక్తి కట్టిస్తాయి. ఆ తర్వాత నుంచే సినిమా గమనం కాస్త గాడి తప్పినట్టు అనిపిస్తుంది. పలు ఉపకథలతో సాగే సన్నివేశాలు కాస్త గందరగోళంగా అనిపిస్తాయి. సుజీత్ ఈ సినిమా కోసం పలు పార్శ్వాలున్న కథని సిద్ధం చేసుకున్నారు. అది అంతగా హైలైట్ కాలేదు. కథనం కూడా ఫ్లాట్‌గానే అనిపిస్తుంది. ఇందులోని ప్రేమకథ, తండ్రీకొడుకుల తరహా అనుబంధంతో కనిపించే ప్రకాశ్‌రాజ్‌పవన్‌కల్యాణ్‌ల మధ్య భావోద్వేగ కోణాన్ని ఇంకాస్త బలంగా ఆవిష్కరించాల్సింది. కాకపోతే, సినిమా చూస్తున్నంతసేపూ ఇవేవీ గుర్తుకు రాకుండా ఎలివేషన్స్ అలరిస్తుంటాయి. జానీ సినిమాని గుర్తు చేస్తూ సాగే పతాక సన్నివేశాలు అభిమానుల్లో మరింత జోష్‌ని నింపుతాయి. రెండో భాగానికి కావల్సినంత సరంజామా ఈ కథలో ఉంది. పవన్‌కల్యాణ్ ఈ మధ్య కాలంలో ఏ సినిమాలో కనిపించనంత స్టైలిష్‌గా ఇందులో కనిపించారు. ఆయన చేసిన యాక్షన్ ఘట్టాలు కూడా అలరిస్తాయి.

ఎవరెలా చేశారంటే..

చాలాసార్లు ఈ సినిమా పవన్‌కల్యాణ్ వన్ మేన్ షో అనిపిస్తుంది. అందుకు కారణం తెరపై ఆయన్ని ఆవిష్కరించిన తీరే. ప్రథమార్ధం పూర్తయ్యే వరకూ ఆయన చెప్పే డైలాగ్స్‌ని వేళ్లపై లెక్కపెట్టొచ్చు. ఆయన చేతిలోని ఆయుధాలే మాట్లాడుతుంటాయి. కటానా, నాంచాక్, గన్, కత్తి... ఇలా ఆయన చేతిలో ఇమిడిపోయిన ఆయుధాలు చాలానే. ఇందులో చాలామంది నటులే కనిపిస్తారు. ప్రతి పాత్ర గుర్తుండిపోయేలా ఉంటుంది. ఇమ్రాన్ హష్మి కూడా స్టైలిష్‌గా కనిపించినా, కథానాయకుడికి దీటుగా ఆ పాత్రను ఇంకాస్త బలంగా చూపించాల్సింది. కణ్మని పాత్రలో ప్రియాంక మోహన్ అందంగా కనిపించింది. అయితే ఆమె కనిపించే సన్నివేశాలు పరిమితమే. సత్య దాదా పాత్రలో ప్రకాశ్‌రాజ్ , గీత పాత్రలో శ్రియారెడ్డి, జిమ్మీగా సుదేవ్ నాయర్, అభిమాన్యు సింగ్ కీలకమైన పాత్రల్లో కనిపిస్తారు. జాకీష్రాఫ్, లాల్ తెరపై కొన్ని క్షణాల పాటు కనిపించి సుజీత్ ఇదివరకు తీసిన 'సాహో' సినిమాని గుర్తు చేస్తారు సాంకేతికంగా ఈ సినిమాకి ఎక్కువ మార్కులు పడతాయి. ప్రతి విభాగం అత్యుత్తమ పనితీరుని కనబరిచింది. ముఖ్యంగా తమన్. ఆయన నేపథ్య సంగీతం సినిమాకి బలమైన హంగు. పాటలు కూడా ఆకట్టుకుంటాయి. రవి కె.చంద్రన్, మనోజ్ పరమహంస విజువల్స్ సినిమాకి మరో ఆకర్షణ. ఎడిటింగ్, ప్రొడక్షన్ డిజైన్ విభాగాల పనితీరు మెప్పిస్తుంది. సుజీత్ (og director) స్టైలిష్ మేకింగ్ సినిమాని మరో స్థాయిలో నిలబెట్టింది. నిర్మాణం ఉన్నతంగా ఉంది.

**బలాలు**

**+ పవన్‌కల్యాణ్**

**+ హీరోయిజం, ఎలివేషన్స్, యాక్షన్**

**+, నేపథ్య సంగీతం.. విజువల్స్**

**బలహీనతలు**

**- ద్వితీయార్ధంలో కొన్ని సన్నివేశాలు**

**- ఆసక్తి రేకెత్తించని కథనం**

**చివరిగా: ఓజీ... ఫ్యాన్స్ ఖుషీ**

**గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!**

## బాక్సాఫీస్ దగ్గర.. పవన్ తుఫాన్




రాజకీయాల్లో పవన్‌కల్యాణ్ ఒక తుపాన్ అని ఇప్పటికే ఆయన రుజువు చేశారు. ఒక వేదికపై ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పవన్‌ని తుపాన్ అని సంబోధించారు. బాక్సాఫీస్ దగ్గర కూడా పవన్ అంటే ఒక తుపాన్ లాంటి విజృంభణే అని తన సినిమాలతో చాటి చెప్పారు. కొత్త సినిమా 'ఓజీ'తో ఏకంగా ఓ అగ్నిలా చెలరేగేందుకు సిద్ధమయ్యారు. సెప్టెంబరు మాసం తెలుగు సినిమాకి ఎంతగానో కలిసొచ్చింది. వరుసగా విజయాలు నమోదయ్యాయి. ఇదే నెలలోనే వస్తున్న 'ఓజీ' విడుదలకు ముందే బ్లాక్‌బస్టర్ కళని తీసుకొచ్చింది. ఇక రికార్డులు లెక్క పెట్టుకోవడమే మిగిలిందన్నట్టుగా ఉంది ఉత్సాహం. ఓజీ... ఓజీ... ఓజీ... కొన్ని రోజులుగా ఎక్కడికి వెళ్లినా ఈ పేరు వినిపించేది. సినిమా వేడుక ఏదైనా సరే... అక్కడ 'ఓజీ' నినాదం వినిపించేది. అగ్ర కథానాయకుడి సినిమా అంటే అంచనాలు, హైప్ సహజం. కానీ 'ఓజీ' సినిమా హైప్ వేరని ముందస్తు బుకింగ్స్ చాటి చెబుతున్నాయి. ముందస్తు టికెట్ అమ్మకాలతోనే రూ.60 కోట్లు వసూళ్లు సొంతమైనట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అభిమానులు, ప్రేక్షకులే కాదు... వాళ్లలో సెలెబ్రిటీలు కూడా కలిసిపోయి సినిమాపై ఆసక్తిని కనబరుస్తూ వచ్చారు. బుధవారం రాత్రి ప్రీమియర్లతోనే 'ఓజీ' సందడి షురూ అయ్యింది.'ఖుషి' తర్వాత మళ్లీ అంత జోష్ 'ఓజీ' విషయంలోనే కనిపించిందని పవన్‌కల్యాణ్ ఇటీవల జరిగిన వేడుకలో చెప్పారు. ఆ జోష్‌కి కారణం పవన్‌కల్యాణ్ - సుజీత్ - తమన్‌ల కలయికే అనేది పరిశ్రమ వర్గాలు చెప్పే మాట. యువ దర్శకుడు సుజీత్.. పవన్‌కల్యాణ్‌కి వీరాభిమాని. 'సాహో' సినిమాతో స్టైలిష్ దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఒక అభిమాని తాను ఆరాధించే కథానాయకుడితో సినిమా తీస్తున్నప్పుడు సహజంగానే అందరిలోనూ ప్రత్యేకమైన ఆసక్తి ఏర్పడుతుంది. ఒక అభిమానిగా తన హీరోని తెరపై ఎలా చూసుకోవడానికి ఇష్టపడతాడో... అలా చూపించి ఉంటాడని, హీరోయిజం, స్వాగ్, స్టైల్... ఇలా అన్నీ ప్రత్యేకంగా ఉంటాయనే నమ్మకం కలుగుతుంది. పవన్‌కల్యాణ్ - సుజీత్‌కి సంగీత దర్శకుడు తమన్ కూడా తోడు కావడం సినిమాకి మరింత ప్రత్యేకం. మాస్ చిత్రాలకి పెట్టింది పేరు తమన్. పాటలపై ఎంతగా శ్రద్ధ తీసుకొంటారో, ఆయన నేపథ్య సంగీతం అంతకుమించి అనేలా ఉంటుంది. నేపథ్య సంగీతంతో హీరోయిజాన్ని మరో స్థాయికి తీసుకెళుతుంటారు. ఇప్పటికే విడుదలైన 'ఓజీ' పాటలు ట్రెండ్ అయ్యాయి. ఇక థియేటర్లు మోతెక్కిపోవడమే మిగిలిపోయింది.

గ్యాంగ్‌స్టర్... ఓజాస్ గంభీర

పవన్‌కల్యాణ్ గ్యాంగ్‌స్టర్ సినిమా చేసి చాలా కాలమైంది. సరైన సమయంలో సుజీత్ సరైన కథని రాసుకుని 'ఓజీ' చిత్రాన్ని తెరకెక్కించారు. ముంబయి, జపాన్‌తో ముడిపడిన గ్యాంగ్‌స్టర్ డ్రామా ఇది. పవన్‌కల్యాణ్ ఓజాస్ గంభీర పాత్రలో తెరపై సందడి చేయనున్నారు. ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా కనపించనున్నారు. పవన్‌కి జోడీగా ప్రియాంక మోహన్ నటించారు. 'ఖుషి' సినిమాని గుర్తు చేస్తూ, ఇందులో ఓ పెద్ద కత్తి పట్టుకుని సందడి చేస్తున్నారు పవన్‌కల్యాణ్. ఇందులో పాత్రలన్నీ ఎంతో స్టైలిష్‌గా కనిపించనున్నాయని ప్రచార చిత్రాలు చాటుతున్నాయి. ప్రకాశ్‌రాజ్, అర్జున్‌దాస్, శ్రియారెడ్డి, హరీశ్ ఉత్తమన్, సుదేవ్ నాయర్, రాహుల్ రవీంద్రన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. డి.వి.వి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు.

## నీ జీవితంలో ఒక్క వీరోచిత క్షణమైనా ఉందా?

**అనుపమ పరమేశ్వరన్, మలయాళ నటుడు షరాపుద్దీన్ జంటగా నటించిన చిత్రం 'ది పెట్ డిటెక్టివ్'. ప్రణీశ్ విజయన్ తెరకెక్కిస్తున్న తొలి చిత్రమిది. తాజాగా ఈ సినిమా నుంచి చిత్రబృందం 'లా లా లా ది పెట్ డిటెక్టివ్' అనే గీతాన్ని విడుదల చేసింది. "నా ప్రియమైన టోనీ. నువ్వు ఒక్క విలువైన కేసునైనా పరిష్కరించావా? అని నేను అడగను కానీ.. నీ జీవితంలో ఒక్క వీరోచిత క్షణమైనా ఉందా?" అంటూ హీరోయిన్ వేసిన ప్రశ్నతో ప్రారంభమైన ఈ పాట "జంతువుల పంజరం మూసేశారు.. కానీ దానిని తీయడానికి ఎవరు ధైర్యం చేస్తారు" అంటూ హీరో డిటెక్టివ్‌గా పెంపుడు జంతువులను వెతికి పట్టుకునే హాస్యభరిత సన్నివేశాలతో ప్రేక్షకులలో నవ్వులు పూయిస్తోంది. ఈ సినిమా అక్టోబరులో థియేటర్లలో విడుదల కానుంది.**



## 'జైలర్ 2' ఎప్పుడంటే?



రజనీకాంత్ కొత్త సినిమాలతో బిజీ అయిపోయారు. ఇప్పటికే పట్టాలెక్కిన 'జైలర్ 2' చిత్రీకరణలో పాల్గొంటూనే... మరోవైపు తదుపరి సినిమాల కోసం కథల్ని పక్కా చేయడంపై దృష్టిపెట్టారు. 'జైలర్ 2' షూటింగ్ కోసం కేరళ వెళ్లి తిరిగొస్తూ రజనీకాంత్... ఆ సినిమా విడుదల తేదీపై స్పష్టతనిచ్చారు. వచ్చే ఏడాది జూన్ 12న విడుదల చేస్తున్నట్టు తెలిపారు. విజయవంతమైన 'జైలర్'కి కొనసాగింపుగా 'జైలర్ 2' తెరకెక్కుతోంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిన 'జైలర్' ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకుపైగా వసూళ్లు కొల్లగొట్టి ఘన విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ కలయికలోనే ఇప్పుడు 'జైలర్ 2' రూపొందుతోంది. భారీ అంచనాలున్న ఈ సినిమా ఇప్పటికే 60 శాతానికిపైగా చిత్రీకరణని పూర్తి చేసుకున్నట్టు రజనీకాంత్ తెలిపారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న సంగతి తెలిసిం

## 30 ఏళ్లకు జాతీయ అవార్డు... ఓ భావోద్వేగ క్షణం



ముప్పై ఏళ్ల నా సినీప్రయాణంలో తొలి జాతీయ చలనచిత్ర అవార్డుని గెలుచుకోవడం ఒక భావోద్వేగ క్షణమ"ని అన్నారు నటి రాణీ ముఖర్జీ. 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' చిత్రంలో నటనకుగాను ఉత్తమ నటిగా ఈ పురస్కారం ఆమెను వరించింది. మంగళవారం జరిగిన 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో రాణికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ అవార్డుని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో రాణీ ముఖర్జీ మాట్లాడుతూ.."నటిగా నా 30ఏళ్ల ప్రయాణంలో మొదటి జాతీయ అవార్డుని అందుకోవడం నిజంగా నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ గౌరవం నాకొక ప్రపంచం లాంటిది. నా జీవితంలో ఈ క్షణం కోసం ఎప్పుడూ కలలు కన్న నా దివంగత తండ్రికి దీనిని అంకితం చేయాలనుకుంటున్నాను. నేను ఈ రోజు ఆయనను చాలా మిస్ అవుతున్నాను. ఆయన ఆశీర్వాదం నా తల్లి నిరంతర సహకారం, ప్రేరణ నన్ను ఈ శ్రీమతి పాత్ర ద్వారా నడిపించాయని నాకు తెలుసు. నా అభిమానుల అచెంచలమైన ప్రేమ, మద్దతు నాకు గొప్ప ప్రేరణగా నిలిచాయి. ఈ అవార్డు మీ అందరికీ ఎంత ప్రత్యేకమో నాకు తెలుసు. మీరు ఎంత సంతోషంగా ఉన్నారో చూడటం నాకు అపారమైన ఆనందాన్నిస్తుంది"అని అన్నారు. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.."ఇది నార్వేలోని భారతీయ తల్లిని తన పిల్లల నుంచి బలవంతంగా వేరు చేసిన తర్వాత తిరిగి వారి సంరక్షణను పొందేందుకు అధికారులతో తల్లి చేసే పోరాటం. ఒక తల్లిగా దేవికా పాత్ర నాకు చాలా వ్యక్తిగతమైనది. ఈ చిత్రంతో మేము మాతృత్వ స్ఫూర్తిని గౌరవించడానికి ప్రయత్నించాము. మహిళలు ప్రతిరోజు తమలో మోస్తున్న నిశ్శబ్ద శక్తిని ఇది గుర్తు చేస్తుందని నేను ఆశిస్తున్నాన"ని పేర్కొన్నారు. అంతేకాదు రాణీ ముఖర్జీ అవార్డు ప్రదానోత్సవంలో తన కుమార్తె అదిరా పేరున్న ఒక బంగారు గొలుసు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# పోరాడి ఓడిన మేఘన రెడ్డి



కావోసియుంగ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి మారెడ్డి మేఘన రెడ్డి పోరాటం ముగిసింది. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించిన మేఘన... బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో 21–19, 17–21, 14–21తో టాన్‌రుగ్ సెహెంగ్ (థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడిపోయింది.

64 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో మేఘన తొలి గేమ్‌ను దక్కించుకుంది. అయితే అదే జోరును తదనంతరం కొనసాగించలేకపోయింది. రెండో గేమ్‌లో ఒకదశలో 11–12తో ఒక్క పాయింట్ వెనుకంజలో నిలిచిన మేఘన... ఆ తర్వాత తడబడి చివరకు నాలుగు పాయింట్ల తేడాతో గేమ్‌ను కోల్పోయింది. నిర్ణాయక మూడో గేమ్‌లో టాన్‌రుగ్ ఆరంభంలోనే 4–0తో ఆధిక్యంలోకి వెళ్లగా... మేఘన ఒక్కసారి కూడా స్కోరును సమం చేయలేకపోయింది.

ఇదే టోర్నీలో బరిలోకి దిగిన భారత ఇతర క్రీడాకారిణులు దేవిక సిహాగ్ 26–28, 21–17, 21–13తో లీ జిన్ యి మేగన్ (సింగపూర్)పై, ఇషారాణి బారువా 21–13, 21–10తో నూత్నలిన్ రత్తానపాన్‌వోంగ్ (థాయ్‌లాండ్)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకోగా... మాన్సి సింగ్, అషిమత చాలిహా తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు.

# బిగ్‌బాష్ లీగ్‌లో అశ్విన్



సిడ్నీ: బిగ్‌బాష్ లీగ్ (బీబీఎల్)లో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆడనున్నాడు. వచ్చే సీజన్‌లో సిడ్నీ థండర్స్ తరపున అశ్విన్ బరిలో దిగనున్నాడు. బీబీఎల్‌లో అశ్విన్ అరంగేట్రం విషయాన్ని సిడ్నీ ఫ్రాంచైజీ ఈ వారంలోనే ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన 39 ఏళ్ల అశ్విన్ ఇటీవలే ఐపీఎల్‌కు కూడా గుడ్‌బై చెప్పేశాడు. ఇప్పటికే ఐఎల్‌టీ20 వేలంలో పేరు నమోదు చేసుకున్న అశ్విన్.. తాజాగా సిడ్నీ థండర్స్‌తో ఓ అవగాహనకు వచ్చాడు. ఈ ఏడాది డిసెంబరు 14 నుంచి 2026 జనవరి 18 వరకు బీబీఎల్ జరగనుంది.

# బంగ్లాకు అభి'షాక్



**టీమ్ఇండియాది అదే జోరు. విజయపరంపరను కొనసాగిస్తూ సూర్య బృందం ఆసియాకప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అభిషేక్ విధ్వంసానికి కుల్‌దీప్ మాయాజాలం తోడైన వేళ సూపర్ 4 మ్యాచ్‌లో బంగ్లాను మట్టికరిపించింది. బ్యాటుతో చేయాల్సినంత స్కోరు చేయకపోయినా.. పలు క్యాచ్‌లు నేలపాలు చేసినా మ్యాచ్‌లో భారత్ ఆధిపత్యం స్పష్టం.**

టీమ్ఇండియా ఆసియాకప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సూపర్ 4లో తన రెండో మ్యాచ్‌లో బుధవారం 41 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. అభిషేక్ శర్మ (75; 37 బంతుల్లో 6×4, 5×6), కుల్‌దీప్ యాదవ్ (3/18) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. అభిషేక్ అద్భుతంగా బ్యాటింగ్ చేసినా.. మొదట భారత్ అనుకున్న దానికన్నా తక్కువ స్కోరే చేసింది. భారీ స్కోరు చేసేలా కనిపించిన ఆ జట్టు 168/6తో సరిపెట్టుకుంది. హార్దిక్ (38; 29 బంతుల్లో 4×4, 1×6), గిల్ (29; 19 బంతుల్లో 2×4, 1×6) రాణించారు. రిషాద్ (2/27), తంజిమ్ (1/29), ముస్తాఫిజుర్ (1/33) భారత్‌ను కట్టడి చేశారు. ఛేదనలో బంగ్లాదేశ్ 19.3 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌటైంది. కుల్‌దీప్‌తో పాటు వరుణ్ చక్రవర్తి (2/29), బుమ్రా (2/18) కూడా ఆ జట్టును దెబ్బతీశారు. బంగ్లా ఓపెనర్ సైఫ్ హసన్ (69; 51 బంతుల్లో 3×4, 5×6) ఒంటరి పోరాటం చేశాడు.

చకచకా వికెట్లు తీసినా..: బంగ్లా ఛేదనలో ఓపెనర్ సైఫ్ హసన్ ఆటే హైలైట్. మరోవైపు నుంచి వికెట్లు పోతున్నా ధాటిగా ఆడిన అతడు భారత్ కష్టపడేలా చేశాడు. భారత ఫీల్డర్లు అనేక క్యాచ్‌లు వదిలేయడం అతడికి కలిసొచ్చింది. బంగ్లాను రెండో ఓవర్లోనే బుమ్రా దెబ్బతీశాడు. ఓపెనర్ తంజిద్ (1)ను అతడు ఔట్ చేశాడు. అయినా బంగ్లా చక్కగా ముందుకు సాగింది. కారణం సైఫ్ హసన్. సూపర్ బ్యాటింగ్‌తో అతడు బంగ్లాను రేసులో నిలిపాడు. అతడితో రెండో వికెట్‌కు 42 పరుగులు జోడించిన ఎమాన్ (21)ను ఏడో ఓవర్లో కుల్‌దీప్ ఔట్ చేశాడు. పదో ఓవర్లో బంగ్లా 65/2తో నిలవగా.. భారత్ చకచకా వికెట్లు పడగొట్టింది. హృదోయ్ (7)ని అక్షర్, షమీమ్ (0)ను వరుణ్ ఔట్ చేయగా.. సూర్య సూపర్ త్రోకు జేకర్ అలీ (4) రనౌటయ్యాడు.

బంగ్లా 87/5కు పరిమితమైనా భారత్‌కు ధీమా ఉండలేని పరిస్థితి. మరోవైపు సైఫ్ పోరాటమే అందుకు కారణం. అక్షర్ ఓవర్లో రెండు సిక్స్‌లు బాదిన అతడు.. తన దూకుడుతో కలవర పెట్టాడు. ఆఖరి ఆరు ఓవర్లలో బంగ్లాకు 67 పరుగులు అవసరమయ్యాయి. ఆ దశలో కుల్‌దీప్ సూపర్ బౌలింగ్‌తో భారత్‌ను పైచేయిలో నిలిపాడు. 15వ ఓవర్లో ఆరు పరుగులే ఇచ్చిన అతడు.. తన తర్వాతి ఓవర్లో మూడు పరుగులే ఇచ్చి రిషాద్, తంజిమ్‌లను ఔట్ చేశాడు. అంతకుముందు ఓవర్లో సైఫుద్దీన్‌ను వరుణ్ వెనక్కి పంపాడు. 17 ఓవర్లలో బంగ్లా 115/8తో నిలవగా.. భారత్ పట్టుబిగించింది. సైఫ్ హసన్‌ను తర్వాతి ఓవర్లోనే బుమ్రా ఔట్ చేయడంతో మ్యాచ్ పూర్తిగా భారత్ చేతుల్లో వచ్చింది.

అభిషేక్ ఒక్కడే..: అభిషేక్‌కు ముందు‌ అభిషేక్ తర్వాత. భారత్ ఇన్నింగ్స్ గురించి చెప్పాలంటే ఇలాగే చెప్పాలి. మొదటి సగం ఎంత విధ్వంసంతో సాగిందో.. రెండో సగం అంత పేలవంగా నడిచింది. అలవోకగా 200 దాటేలా కనిపించిన టీమ్ఇండియా.. 168 పరుగులతో సరిపెట్టుకోవడం ఏమాత్రం ఊహించనిదే. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియాకు ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభమన్ గిల్ అదిరే ఆరంభాన్నిచ్చారు. ముఖ్యంగా సూపర్ ఫామ్‌లో ఉన్న అభిషేక్ భీకరంగా విరుచుకుపడ్డాడు. నిజానికి తొలి మూడు ఓవర్లు చప్పగానే సాగాయి. స్కోరు 17/0. అభిషేక్ తాను ఎదుర్కొన్న తొలి 8 బంతుల్లో 8 పరుగులే చేశాడు. కానీ నాలుగో ఓవర్ నుంచి మోత మొదలైంది. నసుమ్ బౌలింగ్‌లో గిల్ వరుసగా 4, 6 బాదగా.. అభిషేక్ లాంగాన్‌లో సిక్స్ దంచేశాడు. అక్కడి నుంచి అభిషేక్ తగ్గేదేలే అన్నట్లు సాగిపోయాడు. ఏడో ఓవర్లో ఓ భారీ షాట్ ఆడే ప్రయత్నంలో గిల్ క్యాచ్ ఔట్ కావడంతో 77 పరుగుల విధ్వంసక భాగస్వామ్యానికి తెరపడింది. అక్కడి నుంచే ఇన్నింగ్స్ జోరు తగ్గడం మొదలైంది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందొచ్చిన దూబె (2) ఎంతోసేపు నిలవలేకపోయాడు. అయినా అభిషేక్ మరో రెండు సిక్స్‌లతో ఊపు కొనసాగించడంతో 11 ఓవర్లలో 112/2తో భారత్ భారీ స్కోరుపై కన్నేసింది. కానీ జోరు మీదున్న అభిషేక్.. సూర్యతో సమన్వయ లోపంతో రనౌట్ కావడంతో ఆట స్వరూపమే మారిపోయింది. భారత్ ఇన్నింగ్స్ గతి తప్పింది. సూర్య (5), తిలక్ వర్మ (5) వెంటవెంటనే ఔట్ కావడం టీమ్ఇండియాను దెబ్బతీసింది. 17 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు.. 129/5తో నిలిచింది. ఆ దశలో అక్షర్ తోడుగా హార్దిక్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. జట్టు స్కోరును 170కి చేరువగా తీసుకెళ్లాడు. అభిషేక్ ఔటయ్యాక 8.5 ఓవర్లలో భారత్ కేవలం 56 పరుగులే చేయగలిగింది.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ రనౌట్ 75; శుభమన్ గిల్ (సి) తంజిమ్ (బి) రిషాద్ 29; దూబె (సి) హృదోయ్ (బి) రిషాద్ 2; సూర్యకుమార్ (సి) జేకర్ అలీ (బి) ముస్తాఫిజుర్ 5; హార్దిక్ (సి) తంజిద్ (బి) సైఫుద్దీన్ 38; తిలక్ వర్మ (సి) సైఫ్ (బి) తంజిమ్ 5; అక్షర్ పటేల్ నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 4 మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 168; వికెట్ల పతనం: 177, 283, 3112, 4114, 5129, 6168; బౌలింగ్: తంజిమ్ 40291; నసుమ్ 40340; ముస్తాఫిజుర్ 40331; సైఫుద్దీన్ 30371; రిషాద్ 30272; సైఫ్ హసన్ 2070

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: సైఫ్ హసన్ (సి) అక్షర్ (బి) బుమ్రా 69; తంజిద్ హసన్ (సి) దూబె (బి) బుమ్రా 1; పర్వేజ్ ఎమాన్ (సి) అభిషేక్ (బి) కుల్‌దీప్ 21; హృదోయ్ (సి) అభిషేక్ (బి) అక్షర్ 7; షమీమ్ (బి) వరుణ్ 0; జేకర్ అలీ రనౌట్ 4; సైఫుద్దీన్ (సి) తిలక్ (బి) వరుణ్ 4; రిషాద్ (సి) తిలక్ (బి) కుల్‌దీప్ 2; తంజిమ్ (బి) కుల్‌దీప్ 0; నసుమ్ నాటౌట్ 4; ముస్తాఫిజుర్ (సి) అక్షర్ (బి) తిలక్ 6; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం: (19.3 ఓవర్లలో ఆలౌట్) 127; వికెట్ల పతనం: 14, 246, 365, 474, 587, 6109, 7112, 8112, 9116; బౌలింగ్: హార్దిక్ 20140; బుమ్రా 40182; వరుణ్ చక్రవర్తి 40292; కుల్‌దీప్ 40183; అక్షర్ పటేల్ 40371; శివమ్ దూబె 10100; తిలక్ వర్మ 0.3011

క్యాచ్‌లు పట్టలేక..

మ్యాచ్‌లో భారత్ ఒత్తిడిని ఎదుర్కొందంటే కారణం ఫీల్డింగ్ వైఫల్యమే. బంగ్లా రేసులో నిలవడానికి కారణమైన ఓపెనర్ సైఫ్ హసన్‌కు మన ఫీల్డర్లు అనేక జీవనదానాలు ఇచ్చారు. సైఫ్ 40 మీదున్నప్పుడు అక్షర్, 65 మీదున్నప్పుడు దూబె క్యాచ్‌లు నేలపాలు చేశారు. సైఫ్ అదృష్టం అక్కడితో ఆగలేదు. వ్యక్తిగత స్కోరు 66 వద్ద వికెట్‌కీపర్ శాంసన్ క్యాచ్ వదిలేయడంతో అతడు బతికిపోయాడు. ఆ తర్వాత అభిషేక్ (17వ ఓవర్లో) కూడా అతడి క్యాచ్‌ను చేజార్చాడు. చివరికి 18వ ఓవర్లో అక్షర్ క్యాచ్ పట్టడంతో సైఫ్ నిష్క్రమించాడు. క్యాచ్ అందుకునే ప్రయత్నంలో అక్షర్ కూడా తడబడడం గమనార్హం.

**పాకిస్థాన్ X బంగ్లాదేశ్ రాత్రి 8 నుంచి**

**బంగ్లాదేశ్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ విజేతతో భారత్ ఫైనల్లో తలపడుతుంది. శ్రీలంక టోర్నీ నుంచి నిష్క్రమించింది.**

# వచ్చేస్తోంది మహిళల సమరం

ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. శ్రీలంక కూడా ఆతిథ్యమిస్తోన్న ఈ టోర్నమెంట్ ఈ నెల 30న మొదలవుతుంది. నవంబర్ 2న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. ఇది 13వ ప్రపంచకప్. ఎనిమిది జట్ల ఫార్మాట్లో జరిగే ఆఖరి టోర్నీ ఇదే. ఇకపై జరిగే టోర్నమెంట్లలో జట్ల సంఖ్య పెరగనుంది. ఇటీవల కాలంలో మెరుగైన ప్రదర్శన చేయడంతో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టుపై మంచి అంచనాలే ఉన్నాయి. ఈసారైన ఆ జట్టు ప్రపంచకప్ కల నెరవేరుతుందేమో చూడాలి. ఈ నెల 30న శ్రీలంకతో జరిగే పోరుతో భారత జట్టు టైటిల్ వేట మొదలవుతుంది. టోర్నీ ఆరంభ మ్యాచ్ అదే. ఆస్ట్రేలియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది.

పోటీ పడే జట్లివే

భారత్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక

ఫార్మాట్

ఈ ప్రపంచకప్‌లో గ్రూపులేమీ లేవు. రౌండ్ రాబిన్ ఫార్మాట్లో అన్ని జట్లు మిగతా జట్లతో ఒక్కో మ్యాచ్‌లో తలపడతాయి. అంటే ప్రతి జట్టు ఏడు లీగ్ మ్యాచ్‌లు ఆడుతుందన్నమాట. లీగ్ దశలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. లీగ్‌లో అగ్రస్థానం సాధించిన జట్టుతో నాలుగో స్థానం జట్టు, రెండో స్థానం జట్టుతో మూడో స్థానం జట్టు సెమీస్‌లో తలపడతాయి. గెలిచిన జట్ల మధ్య నవంబరు 2న ఫైనల్ జరుగుతుంది. మూడో స్థానం ప్లేఆఫ్ మ్యాచ్ లేదు.

ఎన్ని మ్యాచ్‌లంటే..

లీగ్ దశలో మొత్తం 28 మ్యాచ్‌లు జరుగుతాయి. మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం మూడు గంటలకు మొదలవుతాయి. ఒక్క న్యూజిలాండ్‌ఇంగ్లాండ్ మ్యాచ్ (అక్టోబరు 26) మాత్రమే వేరే సమయం (ఉదయం 11 గంటలకు)లో ఆరంభమవుతుంది. తొలి సెమీఫైనల్ అక్టోబరు 29న కొలంబోలో, రెండో సెమీఫైనల్ అక్టోబరు 30న ముంబయిలో జరుగుతాయి. పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నింటీ శ్రీలంకలోనే ఆడుతుంది. ఆ జట్టు ఫైనల్ చేరితే ఫైనల్ కొలంబోలో లేదంటే ముంబయిలో జరుగుతుంది.

వార్మప్ మ్యాచ్‌లు

ప్రపంచకప్‌లో ప్రతి జట్టు రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడతాయి. ఒక్క ఆస్ట్రేలియా మాత్రం ఒకటే సన్నాహక మ్యాచ్ ఆడనుంది. తొలి సన్నాహక మ్యాచ్‌లో గురువారం బెంగళూరులో భారత్‌తో ఇంగ్లాండ్ తలపడుతుంది. ఆఖరి సన్నాహక మ్యాచ్ 28న జరుగుతుంది. భారత్, శ్రీలంకలలో మొత్తం అయిదు వేదికలు మహిళల ప్రపంచకప్‌నకు ఆతిథ్యమిస్తాయి. భారత్‌లో విశాఖపట్నం, గువాహటి, నవీ ముంబయి, ఇండోర్‌లో మ్యాచ్‌లు జరుగుతాయి. శ్రీలంకలో కొలంబోలోని ప్రేమదాస స్టేడియం ఒక్కటే ప్రపంచకప్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తుంది.

భారత్ మ్యాచ్‌లు

ఈ నెల 30న శ్రీలంకతో పోరుతో భారత మహిళల జట్టు ప్రపంచకప్ వేట ఆరంభమవుతుంది. భారత జట్టు ఆ తర్వాత అక్టోబరు 5న పాకిస్థాన్‌తో, అక్టోబరు 9న దక్షిణాఫ్రికాతో, అక్టోబరు 12న ఆస్ట్రేలియాతో, అక్టోబరు 19న ఇంగ్లాండ్‌తో, అక్టోబరు 23న న్యూజిలాండ్‌తో, అక్టోబరు 26న బంగ్లాదేశ్‌తో ఆడుతుంది.

గెలిచింది మూడు జట్లేమహిళల ప్రపంచకప్‌ను ఇప్పటివరకు కేవలం మూడు జట్లే గెలిచాయి. టోర్నీ చరిత్రలో ఆస్ట్రేలియా అత్యంత విజయవంతమైన జట్టు. ఏడుసార్లు ఆ జట్టు ట్రోఫీని సొంతం చేసుకుంది. ఇంగ్లాండ్ నాలుగుసార్లు టైటిల్ నెగ్గగా.. న్యూజిలాండ్ ఒకసారి విజేతగా నిలిచింది. భారత్ రెండు సార్లు (2005, 2017) ఫైనల్ చేరినా టైటిల్ మాత్రం నెగ్గలేకపోయింది.

మన సైన్యమిదే..

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రతీక రావల్, హర్లీన్ డియోల్, జెమీమా, రిచా ఘోష్, ఉమా ఛెత్రి, రేణుక సింగ్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీచరణి, రాధా యాదవ్, అమన్‌జ్యోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్.

# హెండర్సన్‌కు అత్యధికం



**రూ. 42 లక్షలకు సొంతం చేసుకున్న కళింగ లాన్సర్స్**

**భారత ఆటగాళ్లలో వివేక్ లాక్రాకు రూ. 23 లక్షలు**

**హాకీ ఇండియా లీగ్ ఆటగాళ్ల వేలం**

న్యూఢిల్లీ: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) వేలంలో లియామ్ హెండర్సన్ అత్యధిక ధర పలికిన ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. బుధవారం నిర్వహించిన మినీ వేలంలో... ఆస్ట్రేలియా డిఫెండర్ కోసం హెచ్ఐఎల్ ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. చివరకు వేదాంత కళింగ లాన్సర్స్ జట్టు 42 లక్షల రూపాయలకు అతడిని సొంతం చేసుకుంది. భారత యువ ఆటగాళ్లు వివేక్ లాక్రా, అంద్రోహిత్ ఎక్కా కూడా మంచి ధర దక్కించుకున్నారు. అంతర్జాతీయ ఆటగాళ్లలో నెదర్లాండ్స్ డిఫెండర్ సండెర్ డె విజిన్‌ను తమిళనాడు డ్రాగన్స్ జట్టు రూ. 36 లక్షలకు కొనుగోలు చేసుకుంది. జర్మనీకి చెందిన ప్రిన్జ్‌ను అంతే మొత్తానికి యూపీ రుద్రాస్ జట్టు తీసుకుంది. భారత టీనేజ్ గోల్‌కీపర్ లక్రా రూ. 2 లక్షల ధరతో వేలంలో ప్రవేశించగా... అతడి కోసం ఫ్రాంచైజీలు పోటీపడి ఆఖరికి బెంగాల్ టైగర్స్ 23 లక్షలకు సొంతం చేసుకుంది. మిడ్‌ఫీల్డర్ ఎక్కాను రూ. 11 లక్షలకు సూర్మా హాకీ క్లబ్ కొనుగోలు చేసుకుంది. 14 ఏళ్ల కేతన్ కుషావహాను బెంగాల్ టైగర్స్ జట్టు రూ. 2.5 లక్షలకు తీసుకుంది. మొత్తం వేలంలో అతడే అతి పిన్న వయసుకేడు. ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత జట్టులో సభ్యుడైన రూపిందర్ పాల్ సింగ్‌ను ఎస్జీ పైపర్స్ జట్టు రూ. 12 లక్షలకు సొంతం చేసుకుంది. అతడితో పాటు బెల్జియంకు చెందిన రోమన్ డువెకొట్, నెదర్లాండ్స్‌కు చెందిన బ్రామ్ వ్యాన్ బాటమ్‌ను కూడా ఫ్రాంచైజీ తీసుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన కూపర్ బర్న్స్ కోసం కళింగ లాన్సర్స్ జట్టు రూ. 34.5 లక్షలు వెచ్చించింది.

మినీ వేలంలో కళింగ ఫ్రాంచైజీ ముగ్గురు భారత ఆటగాళ్లతో పాటు నలుగురు విదేశీ ప్లేయర్లను కొనుగోలు చేసుకుంది. ఆస్ట్రేలియా గోల్ కీపర్ స్నోడెన్‌ను రూ. 10 లక్షలకు సొంతం చేసుకున్న లాన్సర్స్... ఒడిశా జట్టు ప్లేయర్ సునీల్‌ను రూ. 2 లక్షల బేస్ ప్రైస్‌కు కొనుగోలు చేసుకుంది.

క్రెయిగ్ మరాయిస్, బాబీ సింగ్ ధామీని రూ. 10 లక్షల చొప్పున కొనుగోలు చేసుకుంది. యూపీ రుద్రాస్ ఫ్రాంచైజీ యాజమాన్యం అర్ధాంతరంగా తప్పుకోవడంతో... ఆ జట్టు బాధ్యతలను హెచ్ఐఎల్ గవర్నింగ్ కౌన్సిల్ తీసుకుంది. కొత్త యాజమాన్యం వచ్చేంత వరకు ఈ ఫ్రాంచైజీ హెచ్ఐఎల్ ఆధ్వర్యంలో నడవనుంది.

# ఇండియా-ఎ 194 ఆలౌట్..




లఖ్‌నవూ: ఆస్ట్రేలియా-ఎతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో ఇండియా-ఎ తడబడింది. సాయి సుదర్శన్ (75; 140 బంతుల్లో 6×4, 1×6), జగదీశన్ (38; 45 బంతుల్లో 6×4) మినహా బ్యాటర్లంతా విఫలమవడంతో ప్రత్యర్థికి భారీ ఆధిక్యం సమర్పించుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 350/9తో రెండో రోజు ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్-ఎ 420 పరుగులకు ఆలౌటైంది. టాడ్ మర్ఫీ (76; 89 బంతుల్లో 12×4, 1×6), హెన్రీ థార్న్‌టన్ (32 నాటౌట్; 46 బంతుల్లో 3×4, 1×6) పదో వికెట్‌కు 91 పరుగులు జోడించడం విశేషం. ఇండియా-ఎ బౌలర్లలో మానవ్ సుతార్ (5/107), గుర్‌నూర్ బ్రార్ (3/75) రాణించారు. అనంతరం ఇండియా-ఎ తొలి ఇన్నింగ్స్‌లో 52.5 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. కేఎల్ రాహుల్ (11), దేవ్‌దత్ పడిక్కల్ (1), కెప్టెన్ ధ్రువ్ జురెల్ (1), నితీశ్‌కుమార్‌రెడ్డి (1), ఆయుష్ బదోని (21) విఫలమయ్యారు.

బ్యాటింగ్‌లో మెరిసిన థార్న్‌టన్ (4/36), మర్ఫీ (2/48) బౌలింగ్‌లోనూ సత్తాచాటి ఆసీస్-ఎకు 226 పరుగుల ఆధిక్యాన్ని అందించారు. బుధవారం ఆట ముగిసే సమయానికి ఆసీస్-ఎ రెండో ఇన్నింగ్స్‌లో 7.5 ఓవర్లలో 3 వికెట్లకు 16 పరుగులు సాధించింది. మహ్మద్ సిరాజ్ (1/6), గుర్‌నూర్ (1/9), మానవ్ (1/0) ఒక్కో వికెట్ పడగొట్టి ఆసీస్-ఎను దెబ్బతీశారు. మరో రెండ్రోజుల ఆట మిగిలివున్న ఈ మ్యాచ్‌లో ప్రస్తుతం ఆసీస్-ఎ ఖాతాలో 242 పరుగులు ఉన్నాయి.

ప్రసిద్ధ్‌కు కంకషన్: ఇండియా-ఎ ఇన్నింగ్స్‌లో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ కంకషన్‌తో మైదానాన్ని వీడాడు. 39వ ఓవర్లో హెన్రీ థార్న్‌టన్ సంధించిన బౌన్సర్ అతడి హెల్మెట్‌ను బలంగా తాకింది. జట్టు వైద్య బృందం వెంటనే ప్రసిద్ధ్‌కు కంకషన్ పరీక్ష నిర్వహించింది. అనంతరం బ్యాటింగ్ కొనసాగించిన అతడు మూడు ఓవర్ల తర్వాత మైదానాన్ని వీడాడు. ప్రసిద్ధ్ స్థానంలో కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా పేసర్ యశ్ ఠాకూర్‌ను తీసుకున్నారు.